


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 13-11-2025 | సంపుటి - 25 | సంచిక -178 | రూ : 4 | పేజీలు: 8



2లో

## భూటాన్ నుంచి నేరుగా ఆసుపత్రికి ప్రధాని మోదీ..

- ఎర్రకోట పేలుడు బాధితులకు పరామర్శ
- భూటాన్ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన ప్రధాని మోదీ
- ఢిల్లీలోని లోక్ నాయక్ జైప్రకాశ్ ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడిన వైనం
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

## తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా...

- మరోసారి వాయిదా పడిన తెలంగాణ కేబినెట్ సమావేశం
- ఈరోజు జరగాల్సిన భేటీ ఈ నెల 15వ తేదీకి మార్పు
- రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరగనున్న సమావేశం


2లో

## అలాంటి వాహనాలపై భారీగా పెనాల్టీ వేయండి


2లో

- నిబంధనలు ఉల్లంగిస్తున్న వాహనాలపై పెనాల్టీ విధించాలన్న మంత్రి
- ఓవర్ లోడింగ్ వాహనాలు సీజ్ అయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని సూచన
- మహిళా ఆటోలకు అనుమతులు ఇచ్చేందుకు సానుకూలంగా ఉన్నట్లు వెల్లడి

## ఢిల్లీలో కారు బాంబు పేలుడు.. హైదరాబాద్‌లో కొనసాగుతున్న తనిఖీలు


2లో

- మూడు కమిషనరేట్ల పరిధిలో కొనసాగుతున్న హైఅలర్ట్
- డాగ్ స్క్వాడ్ బాంబు స్క్వాడ్ బృందాలతో తనిఖీలు
- ఎక్కడ ఉగ్రకుట్రలు భగ్నమైనా హైదరాబాద్‌లో వెలుగుచూస్తున్న మూలాలు


2లో

## డీజీపీకి కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

- డీజీపీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్న పోలీసు అధికారుల సంఘం
- పోలీసు శాఖ నిష్పక్షపాతంగా పని చేస్తోందని వెల్లడి
- సంస్కారయుతంగా, సభ్యతతో ప్రశ్నించాలని సూచన

## విదేశాలకు మన చేప

- రాష్ట్రంలో అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతుల కేంద్రం
- కేంద్ర ప్రభుత్వం నిర్ణయం.. రూ.47 కోట్లు మంజూరు


2లో

## భూగర్భంలో మొదలై.. అంతర్జాతీయ స్థాయికి!

- రెండు లిస్టెడ్ కంపెనీల ఏర్పాటుకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి సింగరేణి లేఖ
- ఐదేళ్లలో రూ.40 వేల కోట్ల పెట్టుబడులకు ప్రణాళికలు

హైదరాబాద్: భూగర్భ గనుల నుంచి ప్రారంభమైన సింగరేణి సంస్థ వ్యాపారం అంతర్జాతీయ స్థాయికి వెళ్లేందుకు కీలక అడుగులు పడుతున్నాయి. కొత్తగా

తరువాయి 2లో




2లో

## గృహ నిర్మాణ రంగాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారు

- అన్నమయ్య జిల్లా రాయచోటిలో 'ప్రజావేదిక' కార్యక్రమం
- 2029 నాటికి పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని వెల్లడి
- ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తంగా మరో 5.9 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు
- ఇంటింటికీ సోలార్ విద్యుత్, ఇంటర్నెట్ అందిస్తామన్న ముఖ్యమంత్రి

# భూటాన్ నుంచి నేరుగా ఆసుపత్రికి ప్రధాని మోదీ... ఎర్రకోట పేలుడు బాధితులకు పరామర్శ

ఢిల్లీ, నవంబర్ 12 : భూటాన్ పర్యటన ముగించుకుని నేడు దేశానికి తిరిగి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విమానాశ్రయం నుంచి నేరుగా ఢిల్లీలోని లోక్‌నాయక్ జై ప్రకాశ్ నారాయణ్ ఆసుపత్రికి వెళ్లారు. ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడులో గాయపడి అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. రెండు రోజుల భూటాన్ పర్యటన అనంతరం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్న ప్రధాని, ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలను, బాధితులకు అందుతున్న వైద్యాన్ని గురించి వైద్యులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు భూటాన్ పర్యటనలో ఉండగానే ప్రధాని మోదీ ఢిల్లీ పేలుడు ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. "ఢిల్లీలో ఒక విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆప్తులను కోల్పోయిన కుటుంబాల బాధను నేను అర్థం చేసుకోగలను. ఎంతో భారమైన హృదయంతో ఇక్కడికి వచ్చాను. ఈ దుఃఖ సమయంలో దేశం మొత్తం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుంది. మన ఏజెన్సీలు ఈ ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తాయి. బాధ్యులైన వారందరినీ చట్టం ముందు నిలబెడతాం" అని భూటాన్ రాజధాని థింపులో ప్రధాని వ్యాఖ్యానించారు.

**దర్యాప్తు ముమ్మరం చేసిన ఎన్ఐఏ**

మరోవైపు, ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన ఈ పేలుడు ఘటన దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ముమ్మరం చేసింది. కేసు విచారణ కోసం 10 మంది అధికారులతో కూడిన ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఎన్ఐఏ ఏడీజీ విజయ్ సఖారే నేతృత్వంలోని ఈ బృందంలో ఒక ఐజీ, ఇద్దరు డీఐజీలు, ముగ్గురు ఎస్పీలు, మిగిలిన వారు డీఎస్పీ స్థాయి అధికారులు ఉన్నారని అధికార వర్గాలు బుధవారం తెలిపాయి. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మంగళవారం ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను ఎన్ఐఏకి అప్పగించిన విషయం తెలిసిందే. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ఉన్నతస్థాయి భద్రతాధికారులతో సమావేశమై దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. కుట్ర వెనుక ఉన్న సూత్రధారులను వీలైనంత త్వరగా పట్టుకోవాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. "దోషులను పట్టుకోవడంలో ఏ ఒక్క అంశాన్నీ విడిచిపెట్టం" అని ఆయన స్పష్టం చేశారు. ఎన్ఐఏ, ఐబీ, ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశించారు. ఇది గరిష్ఠ నష్టం కలిగించే లక్ష్యంతో జరిపిన ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. వెయ్యికి పైగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, సోషల్ మీడియా కార్యకలాపాలను కూడా పర్యవేక్షిస్తున్నామని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. పేలుడు జరిగిన ప్రాంతంలోని మొబైల్ ఫోన్ డంప్ డేటాను సేకరించి విశ్లేషిస్తున్నారు.

## తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా..

హైదరాబాద్, నవంబర్ 12 : తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈరోజు జరగాల్సి ఉన్న ఈ భేటీని ఈ నెల 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలపై ప్రభుత్వం ఒక స్పష్టమైన నిర్ణయానికి రానుంది. ఈ సమావేశానికి మంత్రులతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరుకానున్నారు. వాస్తవానికి ఈ కేబినెట్ సమావేశం తొలుత నవంబర్ 7వ తేదీన జరగాల్సి ఉండగా, దానిని 12వ తేదీకి మార్చారు. ఇప్పుడు తాజాగా మరోసారి వాయిదా వేసి 15వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం వెలువడిన మరుసటి రోజే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భేటీ తేదీని మార్చినట్లు సమాచారం.

## ఢిల్లీలో కారు బాంబు పేలుడు..
## హైదరాబాద్‌లో కొనసాగుతున్న తనిఖీలు

హైదరాబాద్, నవంబర్ 12 : దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో రెండు రోజుల క్రితం కారు బాంబు పేలుడు సంభవించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో హైఅలర్ట్ కొనసాగుతోంది. నగరంలోని మూడు కమిషనరేట్ల (హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ) పరిధిలో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాయి. దేశంలో ఎక్కడ దాడులు జరిగినా, ఏ రాష్ట్రంలో ఉగ్రకుట్రలు భగ్నమైనా వాటి మూలాలు హైదరాబాద్‌లో వెలుగుచూస్తున్నాయి. రాజధానిలో విధ్వంస చర్యలు తగ్గినప్పటికీ, ఎన్ఐఏ, ఇతర రాష్ట్రాల పోలీసుల సోదాల్లో నగరానికి చెందిన వ్యక్తులు పట్టుబడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా గుజరాత్ ఏటీఎస్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. వారిలో రాజేంద్రనగర్‌కు చెందిన డాక్టర్ అహ్మద్ మోహియుద్దీన్ సయ్యద్ కూడా ఉన్నాడు.

## డీజీపీకి కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

హైదరాబాద్, నవంబర్ 12 : తెలంగాణ రాష్ట్ర డీజీపీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ఖండించింది. డీజీపీ శివధర్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని సంఘం పేర్కొంది. గతంలో ఎన్నడూ లేనంత అప్రమత్తతతో పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని తెలిపింది. రాష్ట్ర పోలీసు విభాగం చట్టానికి, ప్రజలకు ప్రాధాన్యతనిస్తోందని స్పష్టం చేసింది. పోలీసు శాఖ నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తిస్తోందని సంఘం పేర్కొంది. కేటీఆర్ ప్రస్తావించిన అన్ని ఘటనల్లో చట్ట ప్రకారం, నిష్పక్షపాతంగానే కేసులు నమోదు చేసినట్లు పోలీసు అధికారుల సంఘం తెలిపింది. డీజీపీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ఉపసంహరించుకుని, పత్రికాముఖంగా క్షమాపణ కోరాలని డిమాండ్ చేసింది. సంస్కారయుతంగా, సభ్యతతో ప్రశ్నించాలని గుర్తు చేస్తున్నట్లు పేర్కొంది. పోలీసు శాఖకు పింక్, రెడ్ బుక్ అంటూ ఏమీ లేవని, తమకు ఉన్నదల్లా పోలీసు బుక్ మాత్రమేనని, చట్ట ప్రకారం నడుచుకోవడమే తమ విధి అని డీజీపీ శివధర్ రెడ్డి ఇటీవల అన్నారు. డీజీపీ చేసిన వ్యాఖ్యలను విమర్శిస్తూ, కేటీఆర్ ఉపయోగించిన భాషపై రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది.

## అలాంటి వాహనాలపై
## భారీగా పెనాల్టీ వేయండి

హైదరాబాద్, నవంబర్ 12 : రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై భారీగా పెనాల్టీ విధించాలని స్పష్టం చేశారు. ఓవర్ లోడింగ్ వాహనాలు సీజ్ అయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బుధవారం ఆయన రవాణా శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ నిరంతరం ఉండేలా ప్రణాళికను రూపొందించుకుని, దానిని నిక్కచ్చిగా అమలు చేయాలని అన్నారు. రాష్ట్రస్థాయిలో 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్ సేఫ్టీ మంత్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. మహిళా ఆటోలకు అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆయన అన్నారు.

## విదేశాలకు మన చేప

హైదరాబాద్: తెలంగాణలో అంతర్జాతీయ మంచినీటి చేపల (ఇన్‌లాండ్ ఫిషరీస్) ఎగుమతుల కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 13 ఎకరాల్లో దీన్ని నిర్మించేందుకు రూ.47 కోట్లను మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చెన్నైకి చెందిన కన్సల్టెన్సీ సంస్థ కులు ద్వారా డీపీఆర్ తయారు చేయించి... ఇటీవల టెండర్లను పిలిచింది.

**అవసరం ఏమిటి?**

దేశంలోని జలాశయాలు, డ్యామ్‌లు, చెరువులు, కుంటల్లో చేపల ఉత్పత్తి పెరిగింది. ప్రస్తుతం 147.57 లక్షల టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో 42% స్థానికంగా వినియోగం అవుతుండగా 6% మాత్రమే దేశీయంగా ఎగుమతి అవుతోంది. మిగిలిన చేపలు నిరుపయోగం అవుతున్నాయి. వీటిని దేశవిదేశాలకు ఎగుమతి చేసేందుకు వీలుగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది.

**ఇక్కడే ఎందుకు?**

కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేయగా... మంచినీటిలో చేపల ఉత్పత్తికి సంబంధించిన ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి యోజన (పీఎంఎంకేఎస్ఎస్‌వై) అమలులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచినట్లు తేలింది.

## గృహ నిర్మాణ రంగాన్ని
## కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారు

అమరావతి, నవంబర్ 12 : రాష్ట్రంలో 2029 నాటికి ఇల్లు లేని నిరుపేద అనేవారే ఉండకూడదని, ప్రతి ఒక్కరికీ సొంతిల్లు నిర్మించి ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని, అదొక గౌరవం, భద్రత, భవిష్యత్తుకు చిరునామా అని ఆయన అభివర్ణించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో బుధవారం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించిన అనంతరం ఏర్పాటు చేసిన ఈ సభలో ఆయన కీలక ప్రకటనలు చేశారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ఐదేళ్ల పాలనలో గృహ నిర్మాణ రంగాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారని చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. పేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేకపోగా, కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని ఆరోపించారు. "తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం వరకు దేశంలో ఏ ప్రభుత్వం కూడా పేదలకు పక్కా ఇళ్లు కట్టించలేదు. గుడిసెలు గాలొస్తే కొట్టుకుపోయేవి. కానీ పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలని ఆలోచించిన మహానుభావుడు ఎన్టీఆర్. కూడు, గూడు, గుడ్డ నినాదంతోనే టీడీపీ పుట్టింది. మేం 201419 మధ్య 8 లక్షల ఇళ్లు కట్టిస్తే, గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4.73 లక్షల ఇళ్లను రద్దు చేసింది. సొంతంగా ఇల్లు కట్టుకున్న 2.73 లక్షల మందికి ఇవ్వాల్సిన రూ.900 కోట్లు ఎగ్గొట్టారు. ఆ బకాయిలను మా ప్రభుత్వం చెల్లిస్తుంది" అని హామీ ఇచ్చారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు తాము ఇస్తే, గత పాలకులు పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో



సెంటున్నర స్థలం ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అవి కూడా ఊరికి దూరంగా కొండలు, గుట్టల్లో ఇచ్చి చదును పేరుతో కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. పేదలకు ఉచితంగా ఇవ్వాల్సిన ఇసుకను కూడా పందికొక్కుల్లా తిన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్త రావాలి**

ప్రజలు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. "ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలి. నిన్న కనిగిరిలో ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభించాం. ప్రతి నియోజకవర్గంలోనూ వీటిని ఏర్పాటు చేసి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం. రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు రూ.50 వేల కోట్లు రుణాలు తీసుకుని బాధ్యతగా చెల్లిస్తున్నారు. దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు. వారికి అన్ని విధాలా శిక్షణ ఇప్పించి వ్యాపారవేత్తలుగా మారుస్తాం" అని భరోసా ఇచ్చారు.

*** ముస్లింలకు అదనపు సాయం.. కీలక ప్రకటనలు**

గృహ నిర్మాణ లబ్ధిదారులకు చంద్రబాబు పలు వరాలు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం పట్టణాల్లో రూ.2.5 లక్షలు, గ్రామాల్లో రూ.2 లక్షలు ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. ఇకపై బీసీలు, ఎస్సీలతో సమానంగా ముస్లిం మైనారిటీలకు కూడా గృహ నిర్మాణానికి రూ.50 వేలు అదనంగా అందిస్తామని ప్రకటించారు. దీనివల్ల ఆర్థిక స్థోమత లేక ఇళ్ల నిర్మాణాలు నిలిపివేసిన దాదాపు 6 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని, ప్రభుత్వానికి రూ.3,220 కోట్ల భారం పడుతుందని వివరించారు.

*** ఆధునిక సౌకర్యాలతో ఇళ్లు.. భవిష్యత్ ప్రణాళిక**

భవిష్యత్తులో నిర్మించే ఇళ్లను ఆధునిక సౌకర్యాలతో అందిస్తామని చంద్రబాబు తెలిపారు. "ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తాం. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, బీసీలకు సబ్సిడీపై సోలార్ ప్యానెళ్లు అందిస్తాం. దీనివల్ల విద్యుత్ వినియోగదారులే ఉత్పత్తిదారులుగా మారతారు. ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తాం. నా తల్లి పడ్డ కష్టాలు చూసే దీపం పథకం పెట్టాను. ఇప్పుడు 'దీపం 2.0' కింద ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం" అని పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందిస్తామని, పులివెందులతో సహా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ తాగునీరు ఇచ్చే బాధ్యత తమదని స్పష్టం చేశారు. ఉగాది నాటికి మరో 5.9 లక్షల గృహప్రవేశాలు చేయిస్తామని, ఇల్లు లేని అర్హులందరినీ గుర్తించి స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహిస్తామని, పట్టణాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భూగర్భంలో మొదలై.. అంతర్జాతీయ స్థాయికి!

హైదరాబాద్: భూగర్భ గనుల నుంచి ప్రారంభమైన సింగరేణి సంస్థ వ్యాపారం అంతర్జాతీయ స్థాయికి వెళ్లేందుకు కీలక అడుగులు పడుతున్నాయి. కొత్తగా రెండు లిస్టెడ్ కంపెనీల ఏర్పాటుకు సంస్థ పాలకమండలి తాజాగా ఆమోదం తెలిపింది. వీటిలో ఒకటి సింగరేణి గ్లోబల్ లిమిటెడ్(ఎస్‌జీఎల్) పేరుతో దేశ, విదేశాల్లో కీలక ఖనిజాల తవ్వకాలు చేపడుతుంది. మరొకటి సింగరేణి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్(ఎస్ఈఎల్). ఇది దేశంలో సౌర, పవన విద్యుత్కేంద్రాలు, పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థ(బెస్)లను ఏర్పాటు చేసి విద్యుత్‌ను విక్రయించనుంది. ఈ రెండు కంపెనీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోరుతూ తాజాగా సంస్థ లేఖ రాసింది. వీటిని స్టాక్ ఎక్స్ఛేంజ్ లిస్టెడ్ కంపెనీల జాబితాలో చేర్చి పెట్టుబడులను సమీకరిస్తామని తెలిపింది. ఇందుకు కారణాలను కూడా వివరించింది. దేశంలో ఇప్పటికే 100 / 200 మెగావాట్ల సౌర / పవన విద్యుత్కేంద్రాలను ఏర్పాటుచేసి షేర్ల విక్రయం ద్వారా ప్రైవేటు కంపెనీలు పెట్టుబడులను సమీకరిస్తున్నాయని సింగరేణి తెలిపింది. సింగరేణి సైతం 250 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్ల నిర్మాణం పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభించిందని.. మరో 260 మెగావాట్ల ప్లాంట్లు నిర్మాణంలో ఉన్నాయని వివరించింది. 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లు, 200 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థలను ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించింది. ఇప్పటికే మంచిర్యాల జిల్లా పెగడపల్లిలో 1200 మెగావాట్ల థర్మల్ కేంద్రం ద్వారా సంస్థ లాభాలను ఆర్జిస్తోంది. అక్కడే రూ.10,500 కోట్ల వ్యయంతో 800 మెగావాట్ల కొత్త ప్లాంటు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించబోతోంది.

**భారీగా పెట్టుబడులకు ప్రణాళికలు**

ఐదేళ్లలో రూ.40 వేల కోట్ల పెట్టుబడులకు సింగరేణి ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో 70 శాతం వరకు రుణాలుగా తీసుకోవాలనుకుంటోంది. విద్యుత్ ప్లాంట్లతోపాటు కొత్తగా కీలక ఖనిజాల గనులను ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. కర్ణాటకలోని దేవదుర్గ ప్రాంతంలో రాగి, బంగారం నిక్షేపాలపై అధ్యయనం చేసే కాంట్రాక్టు టెండర్‌ను కేంద్రం నిర్వహించిన వేలంలో సింగరేణి దక్కించుకుంది. రాజస్థాన్ ప్రభుత్వం చేపట్టిన సోలార్ పార్క్‌లో 7 వేల ఎకరాలను సింగరేణి సంస్థకు కేటాయించింది. తెలంగాణ, రాజస్థాన్ ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా అక్కడ 1500 నుంచి 2 వేల మెగావాట్ల సౌరవిద్యుత్కేంద్రాలు నిర్మించాలనే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఒడిశాలోని నైనీ ప్రాంతంలో బొగ్గు గనుల తవ్వకాలను ఇటీవల ప్రారంభించింది. అక్కడే ఒక్కోటి 800 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో రెండు విద్యుత్ ప్లాంట్లను రూ.20 వేల కోట్లతో నిర్మించాలనే



ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొని ఇతర రాష్ట్రాల్లో గనులను కొనేందుకు కసరత్తు చేస్తోంది.

*** వ్యాపారం పెంచుకోకపోతే మనుగడ కష్టం**

బొగ్గు ఉత్పత్తి రంగంలో ప్రైవేట్ సంస్థల ప్రవేశంతోపాటు విదేశాల నుంచి దిగుమతులు సింగరేణి వాణిజ్యానికి పోటీగా మారాయి. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం వల్ల బొగ్గుపైనే ఆధారపడితే రాబోయే 30 ఏళ్లలో సంస్థ మనుగడ కష్టంగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఇతర ఖనిజాల తవ్వకాలు, వ్యాపారాల కోసం రెండు లిస్టెడ్ కంపెనీల ఏర్పాటుకు పాలక మండలి ఆమోదం తెలిపింది. వీటి ద్వారా రూ.వేల కోట్ల పెట్టుబడులతో సంస్థను అంతర్జాతీయ స్థాయికి విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

# ఖమ్మం కేంద్రంగా సిపిఐ శత వసంతాల భారీ బహిరంగ సభ




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఖమ్మం కేంద్రంగా డిసెంబర్ 26న సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభ జరగనుందని, సభను విజయవంతం చేసేందుకు కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి భాగం హేమంత్ కుమార్ పిలుపునిచ్చారు. పాల్వంచ పట్టణ పరిధిలోని విగలాంగుల కాలనీలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మున్నా లక్ష్మీ కుమారి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ, మండల, పట్టణ కార్యదర్శుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా భాగం హేమంత్ కుమార్ హాజరై మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి ముందే కాన్పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భవించి, దేశ స్వతంత్ర సంగ్రామంలో తనదైన పాత్ర పోషించిందన్నారు. భారత గడ్డపై నూరేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని చెప్పారు. ఖమ్మం కేంద్రంగా జరిగే శతవసంతాల ముగింపు సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు తరలిరానున్నారని, కవులు మేధావులు కళాకారులు ఈ వేడుకలో పాల్పంచుకుంటున్నారని చెప్పారు. ఈ జిల్లా నుండి 3000 మంది రెడ్ షర్ట్ వాలంటీర్లును కవాతు కోసం సిద్ధం చేస్తున్నాము అని, అందుకోసం జిల్లా వ్యాప్తంగా 10కేంద్రాలలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాది మందితో నిర్వహించనున ఎర్రకవాతుతో ఖమ్మం పట్టణం మరింత అరుణ వర్ణంగా మారనుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా మాట్లాడుతూ వందేళ్ల ముగింపు సందర్భంగా సుమారు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ జరగనుందని చెప్పారు. కమ్యూనిస్టులకు కాలం చెల్లిందంటూ అవాకులు చెవాకులు పేలిన వారికి ఈ వేడుక చెంప పెట్టు కానుందాన్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని సిపిఐ చరిత్ర, పోరాటాలను ప్రతి ఒక్కరికి తెలిపే విధంగా ఇంటింటి ప్రచారం, నిధి సమీకరణ సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు సారయ్య, సర్ రెడ్డి పుల్లారెడ్డి, రేసు ఎల్లయ్య చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, వాసిరెడ్డి మురళి, ఉప్పుశెట్టి రాహుల్, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, భూక్య దాసురు, కమటం వెంకటేశ్వర్లు దేవరకొండ శంకర్ బంధం నాగయ్య ముివ్వ వెంకటేశ్వర్లు తాతాజీ, మండల, పట్టణ కార్యదర్శులు ప్రజాసంఘాల జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు మరమ్మత్తు పనులను పరిశీలించిన కార్పొరేటర్



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : సమస్యను పరిష్కరించే విధంగా రోడ్డును మరమ్మత్తులు చేసి వర్షపు నీరు నిలవకుండా సాఫీగా వెళ్లేలా పనులు చేపడుతున్నామని అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఉషాముళ్ళపూడి ప్రధాన రహదారిలోని ఎల్లమ్మబండ రైతు బజార్ ఎదురుగా ఉన్నా డంపింగ్ యార్డ్ వద్ద డామేజ్ అయిన రోడ్డు మరమ్మత్తు పనులను బుధవారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ డంపింగ్ యార్డ్ చిన్న వర్షానికి కూడా రోడ్డు మీద వర్షపు నీరు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి, సమస్య పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, ఎ.ఈ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వయో వృద్ధుల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : ఈ నెల 12 నుండి 19వ తేదీ వరకు అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ విద్యా చందన (లోకల్ బాడీస్), జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లేనినా తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో వారోత్సవాల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ అన్ని లైన్ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు ఈ వారోత్సవాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లేనినా మాట్లాడుతూ నేటి సమాజంలో వృద్ధులు ఆదరణకు నోచుకోవడం లేదని, కొంతమంది కుటుంబ సభ్యులు వృద్ధుల పోషణ బాధ్యతలు నిర్వహించకుండా వారిని హింసిస్తున్నారని, వయో వృద్ధులకు ఉన్న చట్టం, హక్కును అందరికీ తెలిసేలా ఈ వారం రోజులు గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సైదులు, సీనియర్ సిటిజన్స్ సభ్యులు నాగేశ్వర రావు, సందీప్, బ్రహ్మ కుమారి మహేశ్వరి, సిడిపివోలు పద్మ, లక్ష్మీ ప్రసన్న, కార్యాలయ సిబ్బంది వర ప్రసాద్, నరేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

**– పర్యావరణ పరిరక్షణ క్షేత్ర సంయోజకులు జయదేవ్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కర్ణాటక, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల క్షేత్ర సంయోజకులు, పర్యావరణ సంరక్షకులు జయదేవ్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని బస్టాండ్ సెంటర్‌లోగల వివేకానంద యువ కేంద్రం నందు పర్యావరణ సంరక్షణపై కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జయదేవ్ మాట్లాడుతూ దేశ పౌరులందరూ ప్రత్యేక రోజులలో మొక్కలను నాటాలని సూచించారు. నాటిన మొక్కలను సంరక్షించడం ద్వారా భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని, పర్యావరణాన్ని అందించినవారము అవుతామన్నారు. ఇప్పటికే ఢిల్లీలో కాలుష్యం కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు, మన్‌కీబాత్, సింగరేణియన్ మొక్కల రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రకృతి హరిత దీక్షకురాలు, 6వ తరగతి విద్యార్థిని నైనిక రజువా... జయదేవ్‌కు మొక్కను అందించగా, ఆయన నైనికను అభినందిస్తూ, విద్యార్థులంతా నైనికను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అనంతరం వివేకానంద యూత్ ప్రాంగణంలో గన్నేరు మొక్కను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ, తెలంగాణ ప్రాంత పర్యావరణ సంరక్షకులు విఠల్, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సద్భావన సంయోజకులు పిల్లి రాజేశ్వరరావు, విభాగ్ పర్యావరణ సంయోజకులు పసుమర్తి వెంకటేశ్వర్లు, అమిరిశెట్టి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



# అయ్యప్ప మాలదారులకు నిత్య అన్న ప్రసాద వితరణ



చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్న ప్రసాద వితరణ మూడో రోజు నిర్వహించారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వామి మలాదారులకు ఊడుగు లక్ష్మీ సతీష్ గౌడ్ దంపతులు, వారి కుమారులు శ్రీకాంత్ గౌడ్, తరుణ్ గౌడ్ లు బుధవారం నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య అన్న ప్రసాద వితరణ దాతలు మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు ప్రసాద వితరణ నిర్వహించడం తమ పూర్వ జన్మ సుకృతమని, తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. దాతల కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలని, అయురూ ఆరోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష మాలదారులు ఆశీర్వదించారు. అనంతరం అయ్యప్ప సన్నిధానం ఆధ్వర్యంలో ఊడుగు లక్ష్మీ సతీష్ గౌడ్ దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ నిర్వాహకులు తొర్పునూరి నర్సింహా గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, కళ్యెం నాగరాజు గౌడ్, చెవగోని మహేష్ గౌడ్, వరగంటి వెంకటేష్ గౌడ్, స్వాములు మార్గం శేఖర్ యాదవ్, అందోజు సన్నిధ్ చారి, పోల్దాస్ రాజు, చెరుకు రాము గౌడ్, దాసరి మురళిస్వామి, చెవగోని గణేష్ గౌడ్, బందారపు శివగౌడ్, చెరుకు చైతన్య, తొర్పునూరి సాయి, తొర్పునూరి సాయిలుగౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు పగిడోజు సంతోష్ కుమార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# నిఘా సంస్థల వైఫల్యమే ఎర్రకోట దగ్గర బాంబు పేలుళ్లు

* **డబుల్ ఇంజన్ సర్కార్ బాధ్యత వహించాలి**
* **సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నిఘా సంస్థల వైఫల్యమే ఎర్రకోట వద్ద బాంబు పేలుళ్లకు కారణమని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ఆరోపించారు.దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలో బాంబుపేలుడు దిగ్భ్రాంతికరమని అన్నారు.పదమూడు మంది ప్రాణాలు కోల్పోవడం, అనేక మంది క్షతగాత్రులు కావడం అత్యంత విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి అమానుష కాండను దేశమంతా ముక్తకంఠంతో ఖండించిందన్నారు.ఈ మారణహోమానికి బాధ్యులను అత్యంత కఠినంగా శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు. గత పదేళ్లలో పుల్వామా, పహల్గాం తదితర భారీ ఉగ్రవాద దాడులు జమ్ముకాశ్మీర్‌లో జరిగాయి. తాను ముందస్తు హెచ్చరికలు చేసినా, కేంద్రంలోని హోం మంత్రిత్వశాఖ రోడ్డు మార్గంలో పంపించడం వల్లే జవాన్లు ప్రాణాలు కోల్పోయారని అప్పటి జమ్ముకాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఆవేదన వ్యక్తం చేశారనీ గుర్తు చేశారు.కేంద్ర బీజేపీ కాలం చెల్లిన భావజాలాన్ని మెదళ్లలో నింపి, అధికారానికి నిచ్చెనమెట్లుగా విద్వేషాన్ని వాడుకుని, కార్పొరేట్లకు వనరులను కట్టబెట్టే నయా ఉదారవాద విధానాలు ఉగ్రవాదానికి అండదండలందించేవేనని విమర్శించారు.దేశ భద్రత బాధ్యత కేంద్ర హోం మంత్రిత్వశాఖదేననిఅన్నారు. కనుక కేంద్ర ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకునే బీజేపీ ప్రభుత్వం ఢిల్లీ రాష్ట్రంలో,కేంద్రంలో అధికారంలో ఉందని అయినా దేశ రాజధానిలో జరిగిన ఉగ్రదాడిని అడ్డుకోవడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు.బాంబు పేలుళ్లకు కారణమైన దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా జల్దా రాఘవులు జన్మదిన వేడుకలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీ నగర్ గ్రామ వ్యవస్థపాక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జల్దా రాఘవులు 80 వ పుట్టినరోజు వేడుకలు బుధవారం నాయకులు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, బస్తీ వాసుల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు అభిమానులు, శ్రేయోభిలాషులు ఆయనకు పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయరాం, ఖాజాబాయ్, శంకరయ్య, ఎల్లయ్య, లక్ష్మి నాధ్, రాములు, బాలయ్య, చింతయ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే.. ప్రభుత్వ ధ్యేయం

* **కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**
* **చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజా సంక్షేమమే.. కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ప్రభుత్వం నుంచి పలువురికి మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం తహసిల్దార్ మీరాబాయి ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండల కేంద్రం తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. నిరుపేదల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, చౌటుప్పల్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, మాజీ ఎంపీటీసీ కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ జాల మల్లేష్, మాజీ కౌన్సిలర్ సందగళ్ళ విజయ సతీష్ గౌడ్, నాయకులు పెద్దగోని రమేష్ గౌడ్, మలిగె మల్లేష్ రజక, సామ వెంకట్ రెడ్డి, బండమీది వెంకటేశం, మాందోరి సురేష్, ఎండి ఎజాస్ పాషా, బోసి బాబు, కె వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 14 న మానవహారం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

* **గంజాయి వ్యతిరేక కమిటీ సభ్యులు**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ఈ నెల 14 న జరిగే మానవహారం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గంజాయి వ్యతిరేక కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. బుధవారం గంజాయి వ్యతిరేక కమిటీ సభ్యులు జగద్గిరిగుట్ట సీఐ బి వెంకటేష్ ని మర్యాదపూర్వంగా కలిసి అఖిల పక్షాల,అన్ని బస్తిల కమిటీల గంజాయి వ్యతిరేక సమావేశంలో మంగళవారం తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ అధికారులు,స్థానిక బస్తి కమిటీల ఆధ్వర్యంలో అన్ని బస్తిలలో గంజాయి వ్యతిరేక సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 14న బాలల దినోత్సవం సందర్భంగా అన్ని బస్తిల కమిటీల నాయకులు,అన్ని రాజకీయ పార్టీల నాయకులు,ప్రజలు,విద్యార్థులతో మానవహారాన్ని నిర్వహిచాలని నిర్ణయించడం జరిగిందని ఆ కార్యక్రమానికి హాజరై అందరికి ఐక్య సందేశం ఇవ్వాలని కోరారు. దీంతో సీఐ వెంకటేషం స్పందించి తమ సిబ్బంది కూడా మానవహారంలో పాల్గొంటారని అదే విదంగా సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు, కాంగ్రెస్ నాయకులు సాయి పంతులు, బిఆర్ఎస్ నాయకుడు సాజిద్, జనసేన నాయకులు సతీష్, లేనిన్ నగర్ నాయకులు సదానందం, సాయిలు, రాజు, రవీందర్, శ్రీనివాస్ నగర్ ఖాయుమ్, మైసమ్మ నగర్ బ్రహ్మానంద చారీ, కృష్ణ, వెంకటేష్, సోమయ్య నగర్ కుమార స్వామి, శ్రీనివాస్, ప్రజానాట్యమండలి బాబు, ట్రాన్స్పోర్ట్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ చారీ, బీరప్ప నగర్ చారీ, దేవమ్మ బస్తి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప మాలదారులకు అన్న ప్రసాద వితరణ

*** హాజరైన పబ్బు రాజు గౌడ్, వెన్ రెడ్డి రాజు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ సిద్ధి వినాయక దేవాలయం శ్రీ అయ్యప్ప స్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలదారులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇన్చార్జ్ పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు హాజరై, అయ్యప్ప మాలదారులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు అన్నప్రసాద వితరణ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గత 9సంవత్సరాలుగా అయ్యప్ప మాలదారులకు నిత్య అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులను అభినందించారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలదారులు పబ్బు రాజు గౌడ్, వెన్ రెడ్డి రాజులను చేనేత శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, అయ్యప్ప సేవా ట్రస్ట్ అధ్యక్షుడు రవ్వ సంతోష్ కుమార్ గురు స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తొర్పునూరి లింగస్వామి గౌడ్, పెద్దగోని రమేష్ గౌడ్, సందగళ్ళ కిరణ్, అయ్యప్ప స్వామి సేవా సమితి ట్రస్ట్ సభ్యులు, అయ్యప్ప మాలదారులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ సంఘం నాయకులు కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్ , (ప్రజాస్ఫూర్తి): సంక్షేమ సంఘం నాయకులు కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు బుధవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్షేమ సంఘం నాయకులు కలిసి కట్టుగా ఉంటూ కాలనీ లోని సమస్యలను పరిష్కరించుకుంటూ కాలనీ ప్రగతి వైపుగా పనిచేయాలన్నారు. కాలనీ అభివృద్ధిలో నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రషీదా మహమ్మద్ రఫీ, నూతన అధ్యక్షులు నరేందర్ గౌడ్, కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, బిసు వెంకటేశం గౌడ్, రామకృష్ణ, వెంకట్ రెడ్డి, శ్రీధర్, నాగభూషణం,శివ పాటిల్, నర్సింహా, కృష్ణ రెడ్డి,ముప్పిడి నర్సింహా, మల్లేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రేడ్ తక్కువ చేస్తూ.. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కు

*** ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా**

*** తెలంగాణ రైతు సంఘం**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై.. ధాన్యం గ్రేడ్ తక్కువగా రాస్తున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, చీరిక అలివేలు ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వ్యవసాయ మార్కెట్ యార్డును రైతు సంఘం నాయకులతో కలిసి బుధవారం సందర్శించారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం రైతు అమ్ముకునేందుకు తిప్పలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్ ధాన్యంగా రాస్తున్నారని ఆరోపించారు. తద్వారా మండల వ్యాప్తంగా రైతులు కోట్ల రూపాయలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. అకాల వర్షాలతో 16 సెంటర్లలో ఎకరాకు 20నుంచి 30బస్తాల ధాన్యం కొట్టుకుపోయిందని, ఇప్పుడేమో ఏ గ్రేడ్ ధాన్యాన్ని, బి గ్రేడ్ ధాన్యంగా రాస్తూ రైతులను నిండా ముంచుతున్నారని ధ్వజమెత్తారు. అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శించి ధాన్యం గ్రేడింగ్ ను సరిచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కోశాధికారి ఎం డి పాషా, రైతు సంఘం మండల అధ్యక్షుడు చీరిక సంజీవరెడ్డి, రైతు సంఘం మున్సిపల్ కార్యదర్శి ఆకుల ధర్మయ్య, అధ్యక్షుడు బొడ్డు అంజిరెడ్డి, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాగీరు కిష్టయ్య, నాయకులు పొట్ట శ్రీను, యాట ముత్యాలు, ఎస్ సత్తిరెడ్డి, కొంతం యాదిరెడ్డి, చిన్నగోని మల్లేశం, పడమటి యాదిరెడ్డి, జొన్నగంటి దేవయ్య, కొత్త నరసింహ, అరిగె వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పీపీపీ వైద్య కళాశాలలతో పేద విద్యార్థులకు నష్టం జరగదు

**: మంత్రి సత్యకుమార్**

అమరావతి: పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణంపై వైకాపా ఆందోళన చేస్తుండటం పట్ల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వార్షిక ఫీజులు పెంచింది వైఎస్ జగనేనని మంత్రి ధ్వజమెత్తారు. ప్రజలు ఓడించినా జగన్ తీరు మారలేదన్నారు. "పీపీపీ విధానంలో 10 వైద్య కళాశాలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయి. విద్యార్థుల ప్రవేశాలు, రిజర్వేషన్లు, వార్షిక ఫీజుల నియంత్రణ, నిర్వహణ ప్రభుత్వ అజమాయిషిలోనే జరుగుతాయి. కాలేజీలకు కేటాయించిన భూములపై సర్వ హక్కులు ప్రభుత్వానివే. నిర్వహణలో లోపాలుంటే ప్రభుత్వానికి జోక్యం చేసుకునే హక్కు ఉంటుంది. పీపీపీ విధానంలో పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. వాళ్లు ఒక్క సీటు కూడా నష్టపోరు. కన్వీనర్ కోటా కింద ప్రతి కాలేజీలో 11 సీట్లు చొప్పున 110 సీట్లు అదనంగా పేద విద్యార్థులకు అందుబాటులోకొస్తాయి. వివిధ కేటగిరీల్లో మొత్తం 220 సీట్లు మన విద్యార్థులకు ఏటా అదనంగా లభిస్తాయి. అసత్యాలతో పీపీపీ వైద్య కళాశాలలపై వైకాపా నాయకులు అసంబద్ధ రాజకీయం చేస్తున్నారు. కల్తీ మద్యం, కల్తీ లడ్డు, అవినీతి, అక్రమాల నుంచి దృష్టి మళ్లించడానికే కుటిల రాజకీయాలు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు ఖ్యాతి పెరుగుతుండటంతో రాజకీయంగా అక్కసు వెళ్లగక్కుతున్నారు. వైద్య విద్యార్థుల పట్ల జగన్ మొసలి కన్నీళ్లు కారుస్తూ కార్యకర్తలను రోడ్లపైకి ఉసిగొల్పుతున్నారు. పీపీపీ విధానాన్ని ప్రైవేటీకరణగా చిత్రీకరిస్తూ కోటి సంతకాలంటూ నానా యాగీ చేస్తున్నారు" అని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు.




## పేదలకు సెంటు స్థలమే ఇచ్చి..

# జగన్ మాత్రం విలాసవంతమైన ప్యాలెస్‌లో..

**: మంత్రి అనగాని**



అమరావతి: నేడు పేదల సొంతింటి కల సాకారమవుతున్న చరిత్రాత్మక రోజు అని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. అందరికీ సొంతిల్లు ఉండాలన్న ఎన్టీఆర్ ఆశయాన్ని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు దూరదృష్టి వల్ల 16 నెలల్లోనే 3 లక్షల ఇళ్లు పూర్తి చేసి అందిస్తున్నట్లు వివరించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా నిర్మాణంలో జాప్యం లేకుండా పూర్తి చేసినట్లు చెప్పారు. సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోలేని వారికి కూడా ఏపీ ప్రభుత్వం సాయం అందజేస్తుందని పేర్కొన్నారు. 2029 నాటికి ప్రతి అర్హుడికి పక్కా ఇల్లు ఇవ్వడం తమ లక్ష్యమని చెప్పారు. పేదలందరికీ ఇళ్లని చెప్పి సెంటు పట్టా పేరుతో జగన్ భారీ దోపిడీకి తెరలేపారని విమర్శించారు. పేదవాడి ఇంటికి సెంటు స్థలమే ఇచ్చి ఆయన మాత్రం విలాసవంతమైన ప్యాలెస్‌లో సేదతీరారని దుయ్యబట్టారు.

# కల్తీ నెయ్యి కేసు.. ధర్మారెడ్డిని రెండోరోజు 8 గంటలు విచారించిన సిట్



తిరుపతి: తిరుమల లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దూకుడు పెంచింది. వైకాపా హయాంలో తితిదే ఈవోగా పని చేసిన ఏవీ ధర్మారెడ్డిని రెండో రోజు కూడా 8 గంటలు విచారించింది. తిరుపతి భూదేవి కాంప్లెక్స్ వద్ద సిట్ తాత్కాలిక కార్యాలయంలో డీఐజీ మురళీ రాంబా, అధికారుల బృందం ప్రశ్నల వర్షం కురిపించింది. భోలేబాబా డెయిరీ ద్వారా కల్తీ నెయ్యి సరఫరాపై ప్రశ్నించినట్టు సమాచారం. ప్రొక్యూర్‌మెంట్ కమిటీ నిర్ణయంతో నెయ్యి కొన్నామని ధర్మారెడ్డి చెప్పినట్టు తెలుస్తోంది. కొన్నింటికి ముక్తసరిగా సమాధానాలు ఇవ్వగా, మరికొన్నింటికి మౌనం వహించినట్టు సమాచారం. ఇప్పటికే కల్తీ నెయ్యి కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్‌లనూ సిట్ అధికారులు విచారించారు.

## నరసాపురం వరకు

# 'వందే భారత్'.. సర్వీసులు ఎప్పట్నుంచంటే?





TO NARASAPUR (WITH EFFECT FROM 12.01.2026)

| Train No. 20677 Dr MGR Chennai Central – Narasapur Vande Bharat Express | ↓ | Station | ↑ | Train No. 20678 Narasapur - Dr MGR Chennai Central Vande Bharat Express |
|---|---|---|---|---|
| 5.30 | (d) | Dr MGR Chennai | (a) | 23.45 |
| 07.05/07.10 | (a/d | Renigunta | (a/d | 21.50/21.55 |
| 08.29/08.30 | (a/d | Nellore | (a/d | 19.39/19.40 |
| 09.43/09.45 | (a/d | Ongole | (a/d | 18.29/18.30 |
| 11.08/11.10 | (a/d | Tenali | (a/d | 17.19/17.20 |
| 11.40/11.45 | (a/d | Vijayawada | (a/d | 16.50/16.55 |
| 12.29/12.30 | (a/d | Gudivada | (a/d | 16.04/16.05 |
| 13.14/13.15 | (a/d | Bhimavaram Town | (a/d | 15.19/15.20 |
| 14.10 | (a) | Narasapur | (d) | 14.50 |

చెన్నై సెంట్రల్ విజయవాడ మధ్య నడుస్తున్న వందేభారత్ (నంబరు 20677/20678) నరసాపురం వరకు పొడిగిస్తూ రైల్వే బోర్డు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ రైలు సర్వీసులు నరసాపురం వరకు ఎప్పట్నుంచి మొదలవుతాయనే విషయాన్ని తాజాగా రైల్వే అధికారులు ప్రకటించారు. జనవరి 12 నుంచి వందేభారత్ రైలు నర్సాపురం వరకు సర్వీసులందిస్తుందని సదరన్ రైల్వే బుధవారం సాయంత్రం వెల్లడించింది. ప్రస్తుతం చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరే 'వందేభారత్' రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి స్టేషన్ల మీదుగా విజయవాడకు 11.40కి చేరుతోంది. తాజా నిర్ణయంతో జనవరి 12వ తేదీ నుంచి ఈ రైలు గుడివాడ, భీమవరం మీదుగా నరసాపురం వరకు సర్వీసులందించనుంది. పొడిగించిన ఈ సర్వీసు 11.40 గంటలకు విజయవాడకు చేరుకొని, అక్కడి నుంచి 11.45కి బయల్దేరి.. మధ్యాహ్నం 12.29కు గుడివాడ, 1.14కి భీమవరం, 2.10కి నరసాపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2.50 గంటలకు నరసాపురంలో బయలుదేరి 3.19కి భీమవరం, సాయంత్రం 4.04కి గుడివాడ, 4.50కి విజయవాడకు చేరుతుంది. అక్కడి నుంచి సాయంత్రం 4.55 గంటలకు బయల్దేరి రాత్రి 11.45గంటలకు చెన్నై చేరుకుంటుంది.

## పోలీసుల దాడి..

# 249 కిలోల గంజాయి పట్టివేత

విజయవాడ: కానూరు వద్ద డీఆర్ఐ అధికారులు భారీ మొత్తంలో గంజాయిని పట్టుకున్నారు. ఏపీ ఈగల్ బృందంతో కలిసి నిర్వహించిన దాడిలో 249 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులు గంజాయిని యూపీకి తరలించేందుకు సిద్ధమవుతుండగా అధికారులు దాడి చేశారు. కీలక నిందితుడు సహా నలుగురిని అరెస్టు చేశారు. మరొక నిందితుడు పరారీలో ఉన్నాడు. గంజాయిని ఒడిశా నుంచి విజయవాడకు తీసుకొచ్చిన నిందితులు.. కానూరు వద్ద నిల్వ ఉంచారు. పక్కా సమాచారంతో దాడి చేసిన అధికారులు.. అక్కడున్న గంజాయిని యూపీకి చెందిన వాహనంలో ఎక్కిస్తుండగా పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.49.76లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.


# పోలీసుల దాడి.. 249 కిలోల గంజాయి పట్టివేత

విజయవాడ: కానూరు వద్ద డీఆర్ఐ అధికారులు భారీ మొత్తంలో గంజాయిని పట్టుకున్నారు. ఏపీ ఈగల్ బృందంతో కలిసి నిర్వహించిన దాడిలో 249 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులు గంజాయిని యూపీకి తరలించేందుకు సిద్ధమవుతుండగా అధికారులు దాడి చేశారు. కీలక నిందితుడు సహా నలుగురిని అరెస్టు చేశారు. మరొక నిందితుడు పరారీలో ఉన్నాడు. గంజాయిని ఒడిశా నుంచి విజయవాడకు తీసుకొచ్చిన నిందితులు.. కానూరు వద్ద నిల్వ ఉంచారు. పక్కా సమాచారంతో దాడి చేసిన అధికారులు.. అక్కడున్న గంజాయిని యూపీకి చెందిన వాహనంలో ఎక్కిస్తుండగా పట్టుకున్నారు.




# కాళేశ్వరం పునరుద్ధరణకు కసరత్తు: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



హైదరాబాద్: మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల పునరుద్ధరణకు శాస్త్రీయ, సాంకేతిక విధానంలో కసరత్తు జరుగుతోందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆనకట్టల పునరుద్ధరణ సహా నీటిపారుదలశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. భారత రాష్ట్ర సమితి హయాంలో భారీ వ్యయంతో నిర్మించిన ఆనకట్టల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. మేడిగడ్డ ఆనకట్ట దెబ్బతినడానికి.. అన్నారం, సుందిళ్ల ఆనకట్టలో లీకేజీలకు గల కారణాలు, వైఫల్యాలను విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జ్యుడీషియల్ కమిషన్ నివేదికలు పేర్కొన్నాయని తెలిపారు. డిజైన్లు నిర్మాణం నిర్వహణలో లోపాలు, సరైన నమూనా అధ్యయనాలు లేకపోవడాన్ని ఎన్డీఎస్ఏ నివేదిక ప్రధానంగా ప్రస్తావించిందని.. ఆర్థికపరమైన అవకతవకలు, ప్రణాళికాలోపాలను జ్యుడీషియల్ కమిషన్ పేర్కొందని తెలిపారు. అవకతవకలు, నిర్లక్ష్యం వహించినందుకు కొందరు అధికారులు, ఏజెన్సీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ సిఫారసు చేసిందని మంత్రి పేర్కొన్నారు. రాజకీయ పరంగా, ఇంజనీర్ల స్థాయిలోనూ లోపాలు ఉన్నాయన్న మంత్రి.. ఆనకట్టలను సాంకేతిక విధానంలో సరిచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సీడీఓ లోపాలను కూడా విచారణ సంస్థలు ఎత్తిచూపినందున నైపుణ్యం కలిగిన సాంకేతిక సంస్థలు, కన్సల్టెంట్ల సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కన్సల్టెన్సీ సేవల కోసం పలు సంస్థలు ముందుకొచ్చాయని, 3 తుదిదశకు అర్హత సాధించాయన్న మంత్రి.. ఐఐటీ లాంటి సంస్థలతో కలిసి పనిచేసే వాటికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీడబ్ల్యూపీఆర్ఎస్ అవసరమైన పరీక్షలు చేస్తోందని, వరద ఉద్ధృతి తగ్గిన వెంటనే మరో 15, 20 రోజుల్లో జియోఫిజికల్, హైడ్రాలిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు.



## నల్గొండ జిల్లాలో అటవీ అధికారులపై గ్రామస్థుల దాడి.. ఆరుగురికి గాయాలు

దేవరకొండ: నల్గొండ జిల్లా చందంపేట మండలం గువ్వలగుట్ట వద్ద ఫారెస్ట్ అధికారులపై గ్రామస్థులు దాడి చేశారు. గువ్వలగుట్ట వద్ద అటవీశాఖకు చెందిన భూములను గ్రామస్థులు దున్నుకుంటున్నారనే సమాచారంతో అధికారులు బుధవారం సాయంత్రం అక్కడికి వెళ్లారు. పట్టా కాగితాలు చూపించి దున్నుకోవాలని స్పష్టం చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు.. అటవీ అధికారులు, సిబ్బందిపై రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. గ్రామస్థుల దాడిలో ఆరుగురు అటవీ సిబ్బందికి తీవ్ర గాయాలు కావడంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# నగరానికి రానున్న రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి.. ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష



భారత రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇవాళ ఆయన సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించారు. సంబంధిత విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని, ఆయా డిపార్ట్‌మెంట్ల వారీగా నోడల్ ఆఫీసర్లను నియమించి నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈనెల 16న మధ్యాహ్నం బేగంపేట్ ఎయిర్‌పోర్టు చేరుకుని అక్కడి నుంచి రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనేటి విందులో పాల్గొని రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. తిరిగి రాత్రి 8 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి న్యూఢిల్లీకి బయలుదేరుతారని వెల్లడించారు. బ్లూ బుక్, VVIP ప్రొటోకాల్ మాన్యువల్ ప్రకారం తగు భద్రతా, ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్త్ ప్రణాళికను పోలీస్ శాఖ రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా వివిఐపిలకు తగు భద్రతా ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. జీఏడీ, ఫైర్ సర్వీస్, రోడ్లు, భవనాలు, వైద్యారోగ్య, మున్సిపల్, ఇంధన, బీఎస్ఎన్ఎల్, హార్టికల్చర్ విభాగాలు నిర్దేశించిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఈనెల 21న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మధ్యాహ్నం బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని.. రాజ్‌భవన్‌లో స్వల్ప విరామం తీసుకుని అక్కడే బస చేసి రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన భారతీయ కళా మహోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. రాత్రి రాజ్ భవన్‌లో బస చేసి ఈనెల 22న ఉదయం పుట్టపర్తి పర్యటనకు బయలుదేరుతారని సీఎస్ వెల్లడించారు. ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి రఘునందన్ రావు, అదనపు డీజీపీలు విజయ్ కుమార్, మహేష్ భగవత్, GHMC కమిషనర్ ఆర్. వి.కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు, ప్రొటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య, రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రతినిధులు, ఇతర అధికారులు



## కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టులో విచారణ.. జనవరికి వాయిదా

హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్‌పై విచారణను హైకోర్టు జనవరి రెండో వారానికి వాయిదా వేసింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడానికి 4 వారాల గడువు ఇచ్చింది. ప్రభుత్వ కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు మరో 3 వారాలు గడువు ఇచ్చింది. కేసీఆర్‌తోపాటు హరీశ్‌రావు, స్మితా సబర్వాల్, ఎస్‌కే జోషికి 3 వారాల గడువు ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాళేశ్వరం కమిషన్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే.

# 14న ఎల్బీ స్టేడియంలో అరైవ్ అలైవ్




రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జగ్రత్తలపై 14వ తేదిన భారి స్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం చెపట్టినట్లు తెలిపారు. పోలీసు శాఖ, రవాణా శాఖ, కార్పోరెట్ సంస్థలు, సినీ ప్రముఖులు , ప్రజా ప్రతినిధులు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పరస్పర సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు . డిసెంబర్, జనవరి నెలలో ప్రజా చైతన్యకార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ , హైదరాబాద్ సీపీ సజ్జనార్ , సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి, జాయింట్ సీపీ జోయెల్ డేవిస్, మల్టీజోన్ -1 ఐజీ చంద్ర శేఖర్ రెడ్డి, రోడ్ సెఫ్టీ ఎస్పీలు సందీప్ , మనోహర్ పాల్గొన్నారు.

## స్టార్టప్‌లకు సాయం చేసేందుకు మా ప్రభుత్వం సిద్ధం: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: యువత సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. రాయదుర్గం టీ హబ్‌లో నిర్వహించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సాహసాలు చేసినప్పుడే విజయం దక్కుతుందని పేర్కొన్నారు. ఉన్నత స్థానానికి చేరుకోవాలనే లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా కష్టపడాలన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కొత్త విధానం తెచ్చినట్లు వివరించారు. ''అంకుర పరిశ్రమలు రూ.వంద కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలి. స్టార్టప్‌లకు సాయం చేసేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇవాళ ప్రపంచమంతా మనవైపు చూస్తోంది. వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఇతర దేశాల్లోని అవకాశాల కోసం చూడవద్దు. ఇతర దేశాలు మనపై ఆధారపడే స్థితిక మనం ఎదగాలి'' అని శ్రీధర్‌బాబు అన్నారు.

## గురుకులాల బకాయిలు వెంటనే విడుదల చేయండి: డిప్యూటీ సీఎం



ఎస్సీ, మైనారిటీ గురుకులాల డైట్, అద్దె బకాయిలు, మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన బకాయిలు మొత్తం సుమారు 163 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ప్రజా భవన్‌లో, ఆర్థిక శాఖ అధికారులు, గురుకులాల అధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ఎస్సీ గురుకులాలు, హాస్టల్లు, ఇతర సంస్థలకు సంబంధించిన డైట్, అద్దె, కాస్మోటిక్స్ బకాయిలకు సంబంధించిన 51.36 కోట్లు విడుదల చేయాలన్నారు. వీటితోపాటు రాష్ట్రంలోని అన్ని మైనారిటీ గురుకులాలు మైనార్టీ విద్యాసంస్థలకు సంబంధించిన డైట్, అద్దె బకాయిలు 47.61 కోట్లు విడుదల చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న 63.92 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో , వైవిధ్యంతో కూడిన ఆహారాన్ని అందించాలన్న సదుద్దేశంతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గురుకులాలు, వసతి గృహ విద్యార్థుల డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 200 పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. నిర్వహకులు నాణ్యతలో ఎక్కడ రాజీ పడవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పూర్తిస్థాయిలో పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంస్థల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను సమీక్షించేందుకు అధికారులు నిర్దేశిత క్యాలెండర్ ప్రకారం సందర్శించాలని సూచించారు. అధికారుల సందర్శనకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు నిర్వాహకులు నివేదించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వేళ హల్‌చల్.. పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు!



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. మంగళవారం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా హల్‌చల్ చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. పోలీసులు చెప్పినా వినకుండా యూసుఫ్‌గూడ వద్ద ఓ ఫంక్షన్‌హాల్లోకి అనుచరులతో ఆయన దూసుకెళ్లారని ఫిర్యాదు అందింది. ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారంటూ కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## చెరువుల సుందరీకరణపై హైడ్రా కమిషనర్ కీలక వ్యాఖ్యలు



చెరువుల అభివృద్ధి అంటే అందాలు అద్దడం ఒక్కటే కాదని.. దాని అవసరాలు నెరవేరే విధంగా వాటిని తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్ సూచించారు. సకల జీవకోటికీ ప్రాణాధారంగా వాటిని రూపొందించాలని అన్నారు. చెరువుల్లో ఆక్రమణలను, పోసిన మట్టితో పాటు.. కొన్నేళ్లుగా పేరుకుపోయిన పూడికను, దుర్గంధాన్నితొలగించిన తర్వాత మిగతా ఆకర్షణలపై దృష్టి పెట్టాలని సూచించారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)కింద చెరువులను అభివృద్ధి చేస్తున్నవారు ఈ విషయాలపై దృష్టి పెట్టాలన్నారు. శిల్పకళావేదికలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం బుధవారం నిర్వహించిన సౌత్ ఇండియా సీఎస్ఆర్ సమ్మిట్‌లో హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ ప్రసంగించారు. సీఎస్ఆర్ నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం అయ్యేలా ఆయా సంస్థలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చెరువుల పునరుద్ధరణను హైడ్రా ఎలా చేపట్టిందనేది పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటతో పాటు.. నగరంలో మొదటి విడతగా చేపట్టిన 6 చెరువుల పునరుద్ధరణ గురించి వివరంగా తెలిపారు. చెరువుల్లో వరద నీరు నిలిచేలా లోతు పెంచాల్సినవసరం ఉందని.. అలాగే ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు సరిగా ఉండేలా చూడాలన్నారు. చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా హైడ్రా చర్యలను కూడా వివరించారు.

# చిన్న బూటు.. చిరిగిన దుస్తులు.. దిల్లీ విషాదానికి ఆనవాళ్లు!

ఓ చిన్న బూటు.. భుజానికేసుకునే బ్యాగు.. చిరిగిన దుస్తులు.. సగం తిన్న ఆహారం.. ఇలా ఎన్నో వస్తువులు దిల్లీలో పేలుడు జరిగిన ప్రాంతంలో విషాద ఘటనకు సాక్ష్యాలుగా పడి ఉన్నాయి. అవి చనిపోయిన వారి గుర్తులే కావచ్చు.. లేదా ప్రాణభయంతో పరిగెత్తిన ప్రజల ఆనవాళ్లే అయిఉండొచ్చు. చెల్లాచెదురైన ఒక్కో వస్తువు వెనుక ఒక్కో కథ. కేసు దర్యాప్తు నేపథ్యంలో వాటిని ఎవరూ తాకకుండా అధికారులు ఇప్పటికే ఘటనాస్థలాన్ని సీజ్ చేశారు. పెద్ద సంఖ్యలో సందర్శకులతో సందడిగా ఉండే ఆ ప్రదేశం ఇప్పుడు పోలీసు బారికేడ్ల వెనుక మౌనంగా నిల్చుంది. నిత్యం జనసందోహంతో కళకళలాడే ఈ ప్రదేశం.. విధ్వంసానికి వేదికగా మారడం చూసి తామంతా షాక్‌కు గురయ్యామని ఘటనాస్థలానికి వచ్చిన అనేక మంది తెలిపారు.



ఆ రోజు పేలుడు తీవ్రత చాలా ఎక్కువగా ఉందని సమీపంలోని ఓ వస్త్రాల దుకాణం నిర్వాహకుడు గుర్తుచేసుకున్నారు. "ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. చాలామంది సిలిండర్ పేలిందేమో అనుకున్నారు. 10 నిమిషాల్లోనే దుకాణాలు మూసేయాలని అధికారులు ఆదేశించారు. అప్పటికే బయట ప్రజలు భయాందోళనతో పరుగులు పెడుతున్నారు. వెంటనే మేం దుకాణం సర్దేసి ఇంటిబాట పట్టాం" అని 'పీటీఐ' వార్తాసంస్థకు తెలిపారు. పేలుడు జరిగిన ప్రదేశానికి సమీపంలోని చాలావరకు దుకాణాలు బుధవారం తెరచుకున్నాయి. అయితే.. వ్యాపారం అంతంతమాత్రంగానే సాగిందని నిర్వాహకులు తెలిపారు. "జనం వస్తున్నారు. కానీ.. ఇంతకుముందులా లేదు. ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్. సాధారణంగా ఈ సమయంలో పెద్దఎత్తున గిరాకీ ఉంటుంది. కానీ, పేలుడు నేపథ్యంలో విక్రయాలు పడిపోయాయి" అని ఓ దుకాణదారు చెప్పారు. "మంగళవారం మార్కెట్ దాదాపు ఖాళీగా ఉంది. చాలా దుకాణాలు మూసి ఉన్నాయి. ఇంకా భయం భయంగానే ఉంది. ఇంట్లోవాళ్లు కూడా బయటకు పంపడం లేదు" అని మరొకరు వెల్లడించారు.

*** ట్రాన్స్‌ఫార్మర్ పేలిందనుకుని.. యథావిధిగా వేడుక**

కారు పేలుడు జరిగిన రోజు ఘటనాస్థలానికి సమీపంలో చాందినీ చౌక్‌లోని జైన్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఓ నిశ్చితార్థ వేడుక జరుగుతోంది. ఆ సమయంలో ఒక్కసారిగా పేలుడు శబ్దం విని.. అక్కడున్న వారంతా ఏ ట్రాన్స్‌ఫార్మరో, సిలిండరో పేలిందనుకున్నారట. కొన్ని క్షణాల పాటు డీజే పాటలు ఆపి.. ఏం జరిగిందా? అని అటూఇటూ చూసి మళ్లీ వేడుకల్లో మునిగిపోయారని క్లబ్ కాపలాదారుతోపాటు అక్కడే దుకాణం నడుపుతున్న ఓ వ్యక్తి తెలిపారు. దిల్లీలోని ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన కారు పేలుడులో ఇప్పటివరకు 12 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.



## వీధి వ్యాపారి కుమారుడు.. సీఏ పాసయ్యాడు

ఆసన్‌సోల్: రేకుల ఇల్లు.. వర్షం పడితే ఇంట్లో నీళ్లు.. వీధి వీధి తిరుగుతూ దుస్తుల విక్రయం.. చాలీచాలనీ ఆదాయం.. ఇదీ పశ్చిమ బెంగాల్ సీతారామ్‌పుర్‌కు చెందిన దుర్గేశ్ ప్రసాద్ దుస్థితి. పేదరికం వెక్కిరిస్తున్నా.. అతడి ముగ్గురు పిల్లలు మాత్రం రత్నాలు! తండ్రి కష్టాలను కళ్లారా చూసిన పెద్ద కుమారుడు ఆదర్శ్ ప్రసాద్.. చదువుల్లో రాణించి ఇటీవల సీఏ పాస్ కావడం విశేషం. దీంతో తమ కష్టాలు గట్టెక్కినట్లేనని దుర్గేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదర్శ్ మొదటి నుంచి చురుకైన విద్యార్థి. అతడి ప్రతిభను గమనించి ఉపాధ్యాయులు ఉచితంగానే ట్యూషన్ చెప్పేవారు. తన కుమారుడి చదువులకు ఏ లోటూ లేకుండా దుర్గేశ్ కష్టపడ్డారు. సీఏ ప్రిపరేషన్ సమయంలో దాతలూ అండగా నిలిచారు. వారిని ఆదర్శ్ నిరాశపర్చలేదు. ఎన్ని ఇక్కట్లు ఎదురైనప్పటికీ.. నాన్న తన వెన్నంటే ఉన్నారని గుర్తుచేసుకున్నాడు. దుర్గేశ్ మిగతా ఇద్దరు పిల్లలూ కోల్‌కతాలో అకౌంటెన్సీ చదువుతుండటం గమనార్హం.

## దిల్లీ పేలుడు ఘటన.. కిరాతక ఉగ్ర ఘాతుకం

**: కేంద్ర కేబినెట్**

దిల్లీ కారు పేలుడు ఘటన నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. దర్యాప్తు కొనసాగుతున్న తీరు, భద్రతా చర్యలు, ఆయా సంస్థల మధ్య సమన్వయంపై దృష్టి సారించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా రెండు నిమిషాల పాటు కేంద్ర కేబినెట్ మౌనం పాటించింది. ప్రధాని నివాసంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, తదితరులు పాల్గొన్నారు.

*** ఉగ్రవాదంపై పోరు కొనసాగుతుంది..**

దిల్లీ పేలుడు ఘటనను ఖండించిన కేంద్ర కేబినెట్.. ఇది కిరాతక ఉగ్ర ఘాతుకంగా పేర్కొంది. ఉగ్రవాదంపై పోరు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ ఘటనకు కారకులైన వారిని చట్టం ముందు నిలబెడతామని ఉద్ఘాటించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

*** ఎగుమతి ప్రోత్సాహకం కోసం..**

ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో దీనికి ఆమోద ముద్ర వేసింది. దీని ద్వారా ఆరేళ్లపాటు రూ.25,060 కోట్లు కేటాయించనున్నారు. ఎగుమతుల ఎకో సిస్టమ్ బలోపేతానికే ఈ మిషన్‌ను తీసుకొచ్చారు. ఎగుమతిదారుల కోసం క్రెడిట్ గ్యారంటీ పథకం విస్తరణకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.





### దిల్లీ పేలుడు ఘటన..
## మరో కారు స్వాధీనం

దిల్లీ పేలుడు ఘటన దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఎర్రకోట పార్కింగ్ సమీపంలో పేలిపోయిన ఐ20 కారు నడిపిన నిందితుడి పేరుతో మరో కారు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు (DL 10CK0458) కోసం ముమ్మర గాలింపు చేపట్టిన పోలీసులు.. చివరకు హరియాణాలోని ఓ గ్రామంలో స్వాధీనం చేసుకున్నారు. ఉమర్ నబీ పేరుతో మరో కారు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. అది ఎక్కడుందో కనిపెట్టేందుకు ముమ్మర గాలింపు చేపట్టారు. హరియాణా, ఉత్తర్ ప్రదేశ్ పోలీసులను అప్రమత్తం చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లు, సరిహద్దు చెక్‌పోస్టులను అప్రమత్తం చేశారు. ఈ ఎరుపు రంగు కారును గుర్తించేందుకు ఐదు బృందాలను రంగంలోకి దించి సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. వాహన నంబరు, ఇతర వివరాలను కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. చివరకు హరియాణా ఫరీదాబాద్ జిల్లాలోని ఖాండవాలీ గ్రామంలో గుర్తించిన పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపు..ఆ ఎయిర్‌పోర్ట్‌లలో భద్రత పెంపు

దేశవ్యాప్తంగా పలు ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. బుధవారం గురుగ్రామ్‌లోని ఇండిగో ప్రధాన కార్యాలయానికి దుండగులు బాంబు బెదిరింపు మెయిళ్లు పంపారు. అందులో దిల్లీ, కోల్‌కతా, తిరువనంతపురం నుంచి నడుస్తున్న పలు విమానాల్లో బాంబు అమర్చినట్లు బెదిరింపులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన ఎయిర్‌లైన్స్ అధికారులు ఆయా విమానాశ్రయాల అధికారులను అలర్ట్ చేశారు. 186 మంది ప్రయాణికులతో కోల్‌కతా నుంచి ముంబయికి వెళ్లనున్న ఇండిగో విమానంలో బాంబు పెట్టినట్లు బెదిరింపు రావడంతో ప్రయాణికులను కిందకు దించేసి, విమానాన్ని ఐసోలేషన్ బేకు




తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. దిల్లీ, తిరువనంతపురం విమానాశ్రయాల్లో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది. బాంబు స్క్వాడ్ బృందాలతో ఇండిగో విమానాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టామన్నారు. తాజాగా దేశరాజధానిలో పేలుడు సంభవించడంతో దిల్లీ విమానాశ్రయంలో భారీ భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు. బెదిరింపు మెయిళ్లు పంపిన వారిని గుర్తించడానికి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## భాజపాలో జోష్.. 501 కిలోల లడ్డూల ఆర్డర్



హోరాహోరీగా సాగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈ నెల 14న విడుదల కానున్నాయి. చాలావరకు ఎగ్జిట్ పోల్స్ ఎన్డీయే కూటమికే పట్టం కట్టాయి. దీంతో భాజపా శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఫలితాల రోజు భారీఎత్తున వేడుకలు చేసుకునేందుకుగానూ ఇప్పటినుంచే సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కాషాయ పార్టీ రాష్ట్ర రాజధాని పట్నాలో 501 కిలోల లడ్డూలను ఆర్డర్ చేసినట్లు సమాచారం. "ఫలితాల రోజు మేమంతా హోలీ, దసరా, దీపావళి, ఈద్ పండగలు చేసుకుంటాం. ఎందుకంటే.. ఓటర్లు ఎన్డీయే కూటమి అభివృద్ధికి జైకొట్టారు" అని ఓ భాజపా నేత 'పీటీఐ' వార్తాసంస్థకు తెలిపారు. గెలుపు సంబరాల్లో భాగంగా ప్రజలకు పంచేందుకుగానూ తమ పార్టీ ఇప్పటికే 501 కిలోల లడ్డూలను ఆర్డర్ చేసినట్లు వెల్లడించారు. పట్నాలోని ఓ లడ్డూ తయారీదారు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. నవంబర్ 14 ఉదయానికి డెలివరీ చేస్తామని చెప్పారు. బిహార్‌లో ఈ నెల 6, 11వ తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ నిర్వహించారు. 1951 తర్వాత రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా దాదాపు 66.91 శాతం పోలింగ్ నమోదైంది. మంగళవారం పోలింగ్ ముగిసిన అనంతరం వివిధ సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ అన్నీ కూడా మళ్లీ ఎన్డీయేనే అధికారాన్ని చేజిక్కించుకోబోతోందన్న అంచనాలను వెల్లడించాయి. అయితే, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ వీటిని తోసిపుచ్చారు. భాజపా అధిష్ఠానం ఆదేశాల మేరకు సర్వే సంస్థలు నడుచుకున్నాయని ఆరోపించారు. గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు.

### ఎర్రకోట పేలుడు ఘటన..
## అల్‌ఫలాహ్‌లో వైద్యుడు మిస్సింగ్..?

ఎర్రకోట పేలుడు ఘటన తర్వాత హరియాణాలో ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ వార్తల్లో నిలిచింది. ఇప్పుడు ఆ విద్యాసంస్థకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ నిసార్ ఉల్ హసన్ కనిపించకుండాపోయాడు. గతంలో అతడిపై ఉగ్ర ఆరోపణలు ఉండటం గమనార్హం. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. దిల్లీ పేలుడు తర్వాత అల్‌ఫలాహ్ యూనివర్సిటీలో దర్యాప్తు అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. పలువురిని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ విద్యాసంస్థలో నిసార్ పనిచేస్తున్నట్లు గుర్తించారని తెలుస్తోంది. 2023లో అతడిని లెఫ్టినెంట్ గవర్నర్ ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పుడు అతడు కశ్మీర్‌లోని ఎస్‌ఎంహెచ్‌ఎస్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసేవాడు. ఉగ్రమూకలతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో ఆర్టికల్ 311(2)(C) కింద




ఉద్యోగం నుంచి తీసేశారు. భద్రతకు సంబంధించిన కేసుల్లో శాఖాపరమైన విచారణ లేకుండానే సదరు ఉద్యోగిని విధుల నుంచి తప్పించేందుకు ప్రభుత్వానికి వీలు ఉంటుంది. ఆ తర్వాత అతడికి యూనివర్సిటీలో మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా ఉద్యోగం లభించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక నవంబర్ 10 పేలుడు తర్వాత అతడు కనిపించకుండా పోయాడని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం అతడి జాడ కోసం గాలిస్తున్నారు.

## ఆ కథనాలు బాధించాయి.. పేలుడు నిందితులతో సంబంధం లేదు

**: అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయం**

దిల్లీ పేలుడు ఘటనతో హరియాణాలో ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ పేరు మారుమోగింది. అక్కడ పని చేస్తోన్న వైద్యులు కీలక అనుమానితులుగా మారారు. దీనిపై యూనివర్సిటీ యాజమాన్యం స్పందించింది. ఈ దురదృష్టకర పరిణామాలు తమను బాధించాయని, తమ సంస్థ గురించి వస్తోన్న కథనాలను ఖండిస్తున్నామని ప్రకటన విడుదల చేసింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ భూపిందర్ కౌర్ ఆనంద్ పేరిట ఇది విడుదలైంది. ఆ వైద్యులకు తమతో వృత్తిపరమైన సంబంధం మాత్రమే ఉందని స్పష్టం చేసింది. "అల్‌ఫలాహ్ గ్రూప్ 1997 నుంచి వివిధ విద్యాసంస్థలను నిర్వహిస్తోంది. తర్వాత యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ దీనిని గుర్తించింది. 2019 నుంచి ఇక్కడ ఎంబీబీఎస్ కోర్సును నిర్వహిస్తున్నాం. మా సంస్థలో విద్యనభ్యసించి, పట్టభద్రులైన వారు భారత్, విదేశాల్లో ప్రముఖ ఆసుపత్రులు, సంస్థల్లో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నారు. ప్రస్తుతం జరుగుతోన్న దురదృష్టకర పరిణామాలు మమ్మల్ని బాధించాయి . వాటిని మేం ఖండిస్తున్నాం. ఈ బాధాకర ఘటనలతో ప్రభావితమైన వారి గురించే మా ఆలోచనంతా. దర్యాప్తులో భాగంగా మా వద్ద పనిచేస్తోన్న ఇద్దరు వైద్యులను అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. వృత్తిపరంగా తప్ప, వారికి విశ్వవిద్యాలయంతో ఎలాంటి సంబంధం లేదు. యూనివర్సిటీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా కొన్ని ఆన్‌లైన్ సంస్థలు నిరాధార కథనాలు వ్యాప్తి చేయడంపై ఆందోళన చెందుతున్నాం.

# మార్కెట్లకు లాభాల హ్యాట్రిక్..

**వరుసగా మూడో రోజూ సూచీల దూకుడు**

**595 పాయింట్ల లాభంతో 84,466 వద్ద స్థిరపడ్డ సెన్సెక్స్**

**180 పాయింట్లు పెరిగి 25,875 వద్ద ముగిసిన నిఫ్టీ**

**ఐటీ, ఆటో, ఫార్మా రంగాల్లో వెల్లువెత్తిన కొనుగోళ్లు**

**అంతర్జాతీయ సానుకూల సంకేతాలు, దేశీయంగా బలమైన ఆర్థిక అంశాల మద్దతు**

**డాలర్‌తో పోలిస్తే 6 పైసలు బలహీనపడిన రూపాయి**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు కూడా లాభాల జోరును కొనసాగించాయి. బుధవారం ట్రేడింగ్‌లో ఐటీ, ఫార్మా, ఆటో రంగాల్లో కొనుగోళ్ల ఉత్సాహం వెల్లువెత్తడంతో సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, దేశీయంగా బలమైన ఆర్థిక పరిస్థితులు మదుపరుల సెంటిమెంట్‌ను బలపరిచాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 595.19 పాయింట్లు లాభపడి 84,466.51 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 180.85 పాయింట్లు పెరిగి 25,875.80 వద్ద ముగిసింది. బుధవారం ఉదయం సెన్సెక్స్ భారీ గ్యాప్-అప్‌తో 84,238.86 వద్ద ప్రారంభమైంది. రోజంతా కొనుగోళ్ల మద్దతుతో ఒక దశలో 84,652.01 వద్ద ఇంట్రా-డే గరిష్ఠాన్ని కూడా తాకింది.

"అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్‌కు త్వరలో పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం, అక్కడి జాబ్ మార్కెట్ నెమ్మదించడంతో ఫెడ్ వడ్డీ రేట్లను త్వరగా తగ్గిస్తుందన్న అంచనాలు పెరిగాయి. ఈ కారణాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొంది. దీని ప్రభావం వర్ధమాన దేశాల మార్కెట్లపై కూడా కనిపించింది" అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ విశ్లేషించారు. దేశీయంగా ద్రవ్యోల్బణం తగ్గడం, జీడీపీ వృద్ధి అంచనాలు బలంగా ఉండటం, కంపెనీల ఆర్జనలు మెరుగ్గా ఉంటాయన్న అంచనాలు కూడా మార్కెట్లకు మద్దతునిచ్చాయని ఆయన తెలిపారు.

సెన్సెక్స్ షేర్లలో టీసీఎస్, అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, సన్ ఫార్మా అత్యధికంగా లాభపడగా.. టాటా స్టీల్, టాటా మోటార్స్ పీవీ, టాటా మోటార్స్ సీవీ నష్టాలతో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ సూచీ 2.04 శాతం మేర దూసుకెళ్లగా, నిఫ్టీ ఆటో 1.24 శాతం, నిఫ్టీ బ్యాంక్ 0.23 శాతం చొప్పున లాభపడ్డాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 0.8 శాతం వరకు లాభాలతో ముగియడం మార్కెట్‌లో సానుకూలతకు అద్దం పట్టింది. మరోవైపు, ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 6 పైసలు బలహీనపడి 88.62 వద్ద ముగిసింది. కీలకమైన ఆర్థిక గణాంకాల కోసం ట్రేడర్లు వేచిచూస్తుండటంతో రూపాయి పరిమిత శ్రేణిలో కదలాడింది. ప్రస్తుతం డాలర్ ఇండెక్స్ 99.60 వద్ద స్థిరంగా ఉందని, ఈ వారం విడుదల కానున్న అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు డాలర్, రూపాయి కదలికలపై ప్రభావం చూపుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో రూపాయి 88.40%-%88.85 శ్రేణిలో ట్రేడ్ అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## 28% ప్రీమియంతో టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ ఎంట్రీ



**న్యూఢిల్లీ:** టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ షేర్లు బుధవారం శుభారంభం చేశాయి. టాటా మోటార్స్ తన పాసింజర్, కమర్షియల్ వాహన విభాగాలను విభజించిన నేపథ్యంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలో 28 శాతం ప్రీమియంతో కమర్షియల్ వాహన విభాగం ఎంట్రీ ఇచ్చింది. డిస్కవర్ ప్రైస్‌తో పోలిస్తే 28.48 శాతం ప్రీమియంతో రూ.335 వద్ద షేర్లు లిస్టయ్యాయి. బీఎస్ఈలో 26.09 శాతం ప్రీమియంతో రూ.330.25 వద్ద లిస్ట్ అయ్యాయి. ఎన్ఎస్ఈలో కంపెనీ మార్కెట్ విలువ రూ.1.22 లక్షల కోట్లుగా తేలింది.

టాటా మోటార్స్ 2024లోనే తన ఆటోమొబైల్ విభాగాన్ని రెండు వేర్వేరు సంస్థలుగా డీమెర్జ్ చేస్తున్నట్లు ప్రకటించింది. కమర్షియల్ వాహన వ్యాపారం, దానికి సంబంధించిన పెట్టుబడులు ఒక కంపెనీగాబీ ప్రయాణికుల వాహనాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, జాగ్వార్ ల్యాండ్‌రోవర్, వీటికి సంబంధించిన పెట్టుబడులను ఇంకో కంపెనీగా ఏర్పాటుచేసింది. ఈ డీమెర్జర్ ఈ ఏడాది అక్టోబర్ 1న అమల్లోకి వచ్చింది. అక్టోబర్ 14 నుంచి టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ విభాగం వేరేగా ట్రేడవుతోంది. షేర్ల విభజన తర్వాత అదేరోజు వాణిజ్య విభాగం స్టాక్ ప్రైస్ విలువను కనుగొనేందుకు ప్రత్యేక సెషన్‌ను నిర్వహించారు. అప్పట్లో కనుగొన్న ధరతో పోలిస్తే మంచి లాభంతో తాజాగా స్టాక్ ఎక్స్ఛేంజీల్లోకి ఎంట్రీ ఇచ్చింది. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి ఎన్ఎస్ఈలో టీఎంసీవీ షేర్లు రూ.321 వద్ద ట్రేడవుతుండగా.. టీఎంపీవీ షేర్లు 404.45 వద్ద కొనసాగుతున్నాయి.

## దలాల్ స్ట్రీట్‌లో 'గ్రో' లిస్టింగ్..

**14 శాతం ప్రీమియంతో అరంగేట్రం**

Groww

**న్యూఢిల్లీ:** స్టాక్ బ్రోకింగ్ సంస్థ గ్రో మాతృ సంస్థ బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయింది. ఆ సంస్థ షేర్లు బీఎస్ఈలో 14 శాతం ప్రీమియంతో దలాల్ స్ట్రీట్‌లోకి ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర రూ.100 పోలిస్తే.. ఎన్ఎస్ఈలో 12శాతం ప్రీమియంతో రూ.112 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి. బీఎస్ఈలో రూ.114 వద్ద లిస్ట్ అయ్యాయి.

రూ.6,632 కోట్ల నిధుల సమీకరణలో భాగంగా ఈనెల 4న పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. మొత్తం 36.47 కోట్ల షేర్లు అందుబాటులో ఉంచగా.. 641.86 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. ధరల శ్రేణిని రూ.95-100గా కంపెనీ నిర్ణయించింది. ఇష్యూలో భాగంగా రూ.1,060 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 55.72 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించారు. రిటైల్ పోర్షన్ 9.43 శాతం సబ్‌స్క్రిప్షన్ అందుకోగా.. ఎన్ఐఐ కోటా 14.20 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 22.02 రెట్లు స్పందన అందుకుంది. 2016లో గ్రో ప్రారంభమైంది. ప్రస్తుతం 1.26 కోట్ల మంది క్రియాశీల ఖాతాదారులతో దేశంలోనే అతిపెద్ద స్టాక్ బ్రోకర్‌గా ఉంది. 2025 జూన్‌కు కంపెనీకి 26 శాతానికి పైగా మార్కెట్ వాటా ఉంది.



# స్టార్ ఆల్‌రౌండర్ సహా ముగ్గురు అవుట్..!

**మినీ వేలానికి ముందు విడుదల చేయనున్న ఆర్‌సీబీ..!**

**బెంగళూరు:** రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ 2025 టైటిల్‌ను గెలిచి చరిత్ర సృష్టించింది. తొలిసారిగా టైటిల్‌ను గెలుచుకుంది. విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో టైటిల్‌ను గెలిచి చిరకాల కలను సాకారం చేసుకుంది. మళ్లీ ఆ జట్టు ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా అడుగుపెట్టనున్నది. ఈ సారి ఆర్‌సీబీ జట్టులో పెద్దగా మార్పులు చేసేందుకు ఇష్టపడడం లేదు. అయితే, రాబోయే సీజన్ వేలానికి ముందు ట్రేడ్ విండో ఓపెన్ అయ్యింది. వేలానికి ఫ్రాంచైజీలు తమ జట్లను బలోపేతం చేసుకునేందుకు అనుమతి ఇచ్చే ఓ స్పెషల్ సిస్టమ్. ఎలాంటి వేలం లేకుండానే ఆటగాళ్లు ఓ జట్టు నుంచి మరో జట్టుకు మారే ఛాన్స్ ఉంటుంది. ఈ క్రమంలోనే ఆర్‌సీబీ పలువురు ఆటగాళ్లను విడుదల చేసే అవకాశం ఉంది.

ఈ జాబితాలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్ స్టోన్ పేరు వినిపిస్తుంది. ఆర్‌సీబీ ఈ ఆల్‌రౌండర్‌ను విడుదల చేసే ఛాన్స్ ఉంది. ఆర్‌సీబీ అతన్ని రూ.8.75 కోట్లకు కొనుగోలు చేసింది. గత సీజన్‌లో లివింగ్ స్టోన్ కేవలం 112 మాత్రమే చేశాడు. అంచనాలను అందుకోలేకపోయిన అతన్ని విడుదల చేయాలని ఫ్రాంచైజీ యోచిస్తుంది. ఆర్‌సీబీలో ఇప్పటికే టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రొమిరియో షెప్పర్డ్, జాకబ్ బెథెల్, కృనాల్ పాండ్యాతో మిడిలార్డర్ బలంగా ఉంది. దాంతో లివింగ్‌స్టోన్‌ను తప్పించే ఛాన్స్ ఉంది. అదే సమయంలో ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో జోష్ హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ కలిసి 39 వికెట్ల పడగొట్టి అద్భుతంగా రాణించారు. యష్ దయాల్, రసిక్ సలామ్‌లను విడుదల చేసే అవకాశం ఉంది. టోర్నీ చివరలో యష్ దయాల్ ఫామ్ తగ్గడంతో పాటు ఆఫ్ ఫీల్డ్ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇక రసిక్ సలామ్‌ను రూ.6కోట్లకు కొనుగోలు చేసినా.. కేవలం రెండు మ్యాచులు మాత్రమే ఆడాడు. ప్రత్యేకంగా తన ప్రభావాన్ని చూపించలేకపోయాడు.

లివింగ్‌స్టోన్, దయాల్, రసిక్‌లను విడుదల చేస్తే ఆర్‌సీబీకి రూ.19.75కోట్లు మిగలనుండగా.. ఈ సొమ్మును మినీవేలంలో వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఎవరైనా విదేశీ ఆటగాడు, లేదంటే టీమిండియా రైజింగ్ స్టార్స్‌ను జట్టులోకి తీసుకునేందుకు వీలుంటుందని భావిస్తున్నది. ఇదిలా ఉండగా.. ఆర్‌సీబీ కీలక ఆటగాళ్లను నిలుపుకుంటున్నది. ఇందులో విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్ ఓపెనింగ్ జోడీ హిట్ గత సీజన్‌లో అయ్యింది.రజత్ పాటిదార్ కెప్టెన్‌గా జట్టును నటిపించాడు. దేవ్‌దత్ పడిక్కల్ మూడవ స్థానంలో రాణించాడు. జితేశ్ శర్మ, మయాంక్ అగర్వాల్, టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, జాకబ్ బెథెల్, కృనాల్ పాండ్యా, జోష్ హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్, లుంగీ ఎన్గిడి, నువాన్ తుషార, సూర్యశర్మ, స్వస్తిక్ చికారే, స్వప్నిల్ సింగ్, మనోజ్ భాండాంగే ఉన్నారు. లియామ్ లివింగ్‌స్టోన్, యష్ దయాల్, రసిఖ్ సలామ్, మోహిత్ రాఠి, అభినందన్ సింగ్ సింగ్‌ను రిలీజ్ చేసే అవకాశాలున్నాయి.

**కర్నాటక క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల్లో**

## మాజీ బౌలర్ వెంకటేశ్ ప్రసాద్..

**మద్దతు తెలిపిన అనిల్ కుంబ్లే, జవగళ్ శ్రీనాథ్..**



**న్యూఢిల్లీ:** కర్నాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌కు జరుగనున్న ఎన్నికల్లో అధ్యక్ష పదవికి భారత మాజీ ఫాస్ట్ బౌలర్ వెంకటేశ్ ప్రసాద్ పోటీ చేయనున్నారు. అనిల్ కుంబ్లే, జవగళ్ శ్రీనాథ్ తదితర దిగ్గజ ఆటగాళ్లు వెంకటేశ్ ప్రసాద్‌కు మద్దతు ప్రకటించారు. కేఎస్‌సీఏ ఎన్నికలు ఈ నెల 30న జరుగనున్నాయి. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 16 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ప్రస్తుత కమిటీ అధ్యక్షుడు రఘురామ్ భట్ పదవీకాలం గత సెప్టెంబర్ 30తో ముగిసింది. వెంకటేశ్ ప్రసాద్ విలేకరుల మాట్లాడుతూ తాను కేఎస్‌సీఏ అధ్యక్ష పోటీకి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్‌కు పూర్వవైభవాన్ని తిరిగి తీసుకురావాలని.. ఇందుకు తెర వెనుక నుంచి ఎవరూ నియంత్రించలేని పరిపాలన అవసరమన్నారు.

కుంబ్లే అధ్యక్షుడిగా, శ్రీనాథ్ కార్యదర్శిగా, తాను ఉపాధ్యక్షుడిగా ఉన్నప్పుడు 2010%-%2013లో విజయవంతమైన కాలాన్ని పునరావృతం చేసేందుకు తన ప్యానెల్ ప్రయత్నిస్తుందని మాజీ బౌలర్ తెలిపారు. ఆ సమయంలో క్రికెట్ అసోసియేషన్‌ను బ్యాక్ డోర్‌లో నడిపేందుకు అనుమతి లేదని.. క్రికెట్, మౌలిక సదుపాయాలు రెండూ అభివృద్ధి చెందాయని.. ప్రస్తుత పరిస్థితి విచారకంగా ఉందని.. దీన్ని మెరుగుపరుచాల్సిన అవసరం ఉందన్నారు. భారత మాజీ బ్యాట్స్‌మన్ సుజిత్ సోమసుందరం (వైస్ ప్రెసిడెంట్), సీనియర్ అడ్మినిస్ట్రేటర్ వినయ్ మృత్యుంజయ (సెక్రటరీ), ఏవీ శశిధర్ (జాయింట్ సెక్రటరీ), మధుకర్ (కోశాధికారి), కర్నాటక మాజీ క్రికెటర్ అవినాష్ వైద్య (సంస్థాగత సభ్యుడు) పోటీ చేయనున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి సోమసుందరం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఎడ్యుకేషన్ చీఫ్ పదవికి రాజీనామా చేశారు.

పదవి, అధికారం కోసం కాదని.. కర్నాటక క్రికెట్‌కు పూర్వ వైభవం తీసుకురావడం గురించి తాము పోటీ చేస్తున్నామన్నారు. అదే సమయంలో మాజీ ఆటగాడు, టీమిండియా మాజీ కోచ్ అనిల్ కుంబ్లే సైతం కేఎస్‌సీఏలో తేవాల్సిన మార్పు అవసరాన్ని నొక్కి చెప్పారు.

**సౌతాఫ్రికాతో తొలి టెస్టు..**

## ధ్రువ్ జురెల్‌కు గ్రీన్ సిగ్నల్

**కోల్‌కతా:** దక్షిణాఫ్రికాతో శుక్రవారం నుంచి కోల్‌కతాలో తొలి టెస్టు ప్రారంభంకానున్నది. అయితే ఆ టెస్టు మ్యాచ్‌లో మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ ఆడేది కన్ఫర్మ్ అయ్యింది. డొమెస్టిక్ క్రికెట్‌లో టాప్ ఫామ్‌లో ఉన్న ఆ బ్యాటర్‌కు ఛాన్సు ఇవ్వనున్నట్లు అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ దోసిచేట్ తెలిపారు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో ధ్రువ్ జురెల్‌కు చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ఆయన వెల్లడించారు. 24 ఏళ్ల జురెల్ ఇప్పటి వరకు ఇండియా తరపున ఏడు టెస్టులు డాడాడు. అయిదు ఫస్ట్ క్లాస్ మ్యాచుల్లో నాలుగు సెంచరీలు చేశాడు. ఇటీవల బెంగుళూరులో సౌతాఫ్రికా-ఏతో రెండు సెంచరీలు చేశాడు. ప్రధాన వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ బరిలోకి దిగనున్నాడు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మ్యాచ్‌లో రిషబ్ పంత్‌తో పాటు ధ్రువ్ జురెల్ కూడా ఉంటాడని అసిస్టెంట్ కోచ్ టెన్ దోసిచేట్ తెలిపారు. ఇద్దరికీ ఛాన్సు ఇవ్వాలన్న క్లారిటీతో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. కోల్‌కతా టెస్టులో ధ్రువ్, రిషబ్ ఆడకుంటే ఆశ్చర్యమే అవుతుందన్నా రు. ఏడాదిన్నర నుంచి అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న జురెల్ .. పరిణితిని ప్రదర్శిస్తున్నాడు. అతను ఆడిన చివరి అయిదు మ్యాచుల్లో 140, 56, 125, 44, 132 , 127 రన్స్ స్కోరు చేశాడు. జురెల్ కేవలం ప్రధాన బ్యాటర్‌గా మాత్రమే బరిలోకి దిగుతాడని, పంత్ కీపింగ్ బాధ్యతలు చేపడుతాడని అసిస్టెంట్ కోచ్ చెప్పాడు.




# నా కష్టాన్ని దేవుడు గుర్తించాడనిపించింది

**మహిళా జట్టు ఓపెనర్ షఫాలీ వర్మ**

**ఒక సంవత్సరం పాటు జట్టుకు ఆడలేకపోయానన్న షఫాలీ వర్మ**

**సహచరులకు గాయమైతే జట్టులోకి రావాలని ఎవరూ కోరుకోరని వ్యాఖ్య**

**అయితే నాకు అవకాశం లభించినందుకు మాత్రం కృతజ్ఞురాలినన్న వర్మ**




**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచ కప్-2025లో ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్‌కు ముందు తాను జాతీయ జట్టులోకి తిరిగి రావడం తన కెరీర్‌లో అత్యంత భావోద్వేగ క్షణాల్లో ఒకటని భారత ఓపెనర్ షఫాలీ వర్మ అభివర్ణించింది. ఒక సంవత్సరం పాటు తాను జట్టుకు ఆడలేకపోయానని, దీంతో తన కష్టాన్ని దేవుడు గుర్తించినట్లుగా అనిపించిందని పేర్కొంది.

ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్‌కు ముందు గాయపడిన ప్రతీక రావల్ స్థానంలో వచ్చిన షఫాలీ వర్మ, ఈ మ్యాచ్‌లో కేవలం 10 పరుగులు మాత్రమే చేసింది. కానీ దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విన్నింగ్ ప్రదర్శనతో తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది.

స్మృతి మంధనతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆమె 78 బంతుల్లో 87 పరుగులు చేసింది. అనంతరం బంతితోనూ ఆకట్టుకుంది. 36 పరుగులు ఇచ్చి రెండు కీలకమైన వికెట్లను పడగొట్టింది.

"ఒక సంవత్సరం పాటు జట్టుకు దూరంగా ఉన్న తర్వాత సెమీ-ఫైనల్‌కు ఎంపిక కావడం నాకు అత్యంత సంతోషకరమైన క్షణం. ఆ సమయం చాలా కఠినమైనది. ప్రతీక రావల్ గాయపడి నన్ను జట్టులోకి తీసుకున్నప్పుడు, దేవుడు నా కష్టాన్ని గుర్తించినట్లుగా నాకు అనిపించింది. సహచరులకు గాయమైతే జట్టులోకి రావాలని ఎవరూ కోరుకోరు. అయితే నాకు అవకాశం లభించినందుకు కృతజ్ఞురాలిని" అని షఫాలీ తెలిపింది.

మేము డీవై పాటిల్ స్టేడియంలో ట్రోఫీని గెలిచినప్పుడు మా కష్టమంతా ఫలించినట్లు అనిపించిందని ఆమె పేర్కొంది. స్టేడియం వాతావరణం తమకు అదనపు శక్తినిచ్చిందని పేర్కొంది.

MOVIE TIME

# 36 ఏళ్ల తరువాత శివ రీ రిలీజ్

ఆర్జీవీ, నాగ్‌లతో సందీప్ వంగా చిట్‌చాట్



**టాకీస్:** నాగార్జున రామ్‌గోపాల్ వర్మకాంబినేషన్‌లో వచ్చిన హిట్ మూవీ 'శివ' 36 ఏళ్ల తర్వాతఈ నెల 14న రీ రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాగ్, ఆర్జీవీలతో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా చిట్‌చాట్ నిర్వహించారు. 'శివ' 36 ఏళ్ల తర్వాత మళ్లీ థియేటర్లలో సందడి చేయబోతోంది! ఫ్యాన్స్ కోసం ప్రత్యేకమైన సంబరాలు ప్లాన్ చేశారు. ఈ వీడియోలో మూడు జంటల మధ్య సరదా, క్రేజీ ముచ్చట్లు, వెనుకబడిన హిట్ మూవీ రహస్యాలు ఇలా ఫ్యాన్స్‌కి స్పెషల్ ఎమోషనల్ మినిట్స్ పంచుకోబోతున్నారు. ఇది కేవలం ఇంట్రెస్టింగ్ వీడియో మాత్రమే కాదు, నోస్టాల్జిక్ ట్రిప్ కూడా! సందీప్, నాగ్, ఆర్జీవీ మ్యూచువల్ బాండ్, సినిమా మేకింగ్ వెనుక ఉన్న స్టోరీస్, ఫన్ రియాక్షన్స్ చూపించడంతో వీడియో మరింత స్పెషల్ అయింది.

# 'మౌగ్లీ' టీజర్ విడుదల




**టాకీస్:** టాలీవుడ్ స్టార్ యాంకర్ సుమ కనకాల తనయుడు, యువ నటుడు రోషన్ కనకాల హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మౌగ్లీ 2025'. ఈ సినిమాకు నేషనల్ అవార్డ్ విన్నర్ సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపాడు. ఈ సినిమాలో రోషన్ సరసన సాక్షి సాగర్ మదోల్కర్ నటిస్తున్నారు. వైవా హర్ష ముఖ్య పాత్రలో కనిపించనున్నాడు. కాలా భైరవ సంగీతం అందిస్తున్నాడు.

# ఆర్ట్ డైరెక్టర్ తోట తరణికి ఫ్రెంచ్ అవార్డు



**టాకీస్:** భారత సినీ రంగానికి మరో గర్వకారణం. ప్రఖ్యాత ఆర్ట్ డైరెక్టర్ తోట తరణికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రదానం చేసే అత్యున్నత సత్కారం 'చెవాలియర్' కు ఆయనను ఎంపిక చేసింది. చెన్నైలోని ఫ్రెంచ్ కాన్సులేట్ కార్యాలయంలో గురువారం ఈ ప్రతిష్టాత్మక పురస్కారం ఆయనకు అందజేయనున్నారు. ఈ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ తోట తరణికి అభినందనలు తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా తెలుగు, తమిళ, హిందీ సినిమాల్లో అద్భుతమైన సెట్ డిజైన్‌లతో మాయ చూపించారు. 'నాయకుడు', 'ఇంద్ర', 'దసరథి', 'జనతా గ్యారేజ్', 'తలపతి' వంటి సినిమాల్లో ఆయన సృష్టించిన సెట్లు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి తోట తరణి గారు, అని స్టాలిన్ పేర్కొన్నారు. ఇక ఆయనకు ఇప్పటికే మూడు నేషనల్ అవార్డులు, అనేక రాష్ట్ర అవార్డులు లభించాయి. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో 'చెవాలియర్' అవార్డు పొందడం ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది. సినీ, కళా రంగానికి ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించి ఈ గౌరవం అందజేస్తున్నట్లు ఫ్రెంచ్ అధికారులు తెలిపారు.



# ప్రొఫెషనల్ లైఫ్‌లోకి తిరిగి సమంత

టాకీస్: టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాలతో పాటు వ్యాపార రంగంలో కూడా తనదైన ముద్ర వేస్తోంది. కొంతకాలం ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత కారణాలతో సినిమాలకు దూరంగా ఉన్న ఆమె, ఇప్పుడు మళ్లీ పూర్తి స్థాయిలో ప్రొఫెషనల్ లైఫ్‌లోకి తిరిగి వచ్చింది. వరుసగా కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేస్తూ, నిర్మాతగా కూడా కొత్త ప్రయోగాలు చేస్తోంది. తాజాగా సమంత తన సొంత బ్యానర్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' కింద 'మా ఇంటి బంగారం' అనే సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమా పూజా కార్యక్రమం ఇటీవలే ఘనంగా జరిగింది. ఇందులో సమంతతో పాటు దిగంత్, గుల్షన్ దేవయ్య ప్రధాన పాత్రల్లో నటించగా, సీనియర్ నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాను రాజ్ నిడుమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి సమంత నిర్మిస్తున్నారు. ఇక సినిమాలతో పాటు సమంత వ్యాపార రంగంలో కూడా వేగంగా దూసుకెళ్తోంది. ఇప్పటికే ఆమె క్లాతింగ్ బ్రాండ్‌ను విజయవంతంగా నడుపుతోంది. ఆ తర్వాత పెర్ఫ్యూమ్ బిజినెస్‌లో అడుగు పెట్టిన సామ్, ఇప్పుడు మరోసారి కొత్త వెంచర్‌ను ప్రారంభించింది. తాజాగా సమంత మరో కొత్త క్లాతింగ్ బ్రాండ్‌ను లాంచ్ చేసింది. ఈ సందర్భంగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ప్రమో వీడియోను షేర్ చేసింది. వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రముఖులు సమంతకు శుభాకాంక్షలు తెలుపుతూ .. 'సామ్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా సక్సెస్ అవ్వాలి,ఎప్పుడూ యూనిక్‌గా ఉంటుంది' అంటూ కామెంట్లు చేస్తున్నారు. కొత్త వ్యాపార ప్రయాణం మొదలెట్టిన సమంత ఇప్పుడు నిజంగానే ఒక హ్యాపీ మోడ్‌లో ఉన్నట్టుంది.

# నాని ప్యారడైజ్ కోసం భారీ సెట్




**టాకీస్:** టాలీవుడ్ స్టార్ యాక్టర్ నాని దసరా డైరెక్టర్‌తో ది ప్యారడైజ్ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే లాంచ్ చేసిన నాని లుక్‌తోపాటు మోహన్ బాబు పోస్టర్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ది ప్యారడైజ్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి సోనాలి కులకర్ణి కీ రోల్ పోషిస్తోంది. సోనాలి కులకర్ణి ఈ చిత్రంలో నాని తల్లిగా కనిపించనుంది. కాగా ది ప్యారడైజ్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతోంది. ఇప్పుడొక ఆసక్తికర వార్త నాని అభిమానుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఇంతకీ విషయమేంటంటే ది ప్యారడైజ్ కోసం హైదరాబాద్‌లో ఏకంగా రూ.7.5 కోట్లతో హౌస్ సెట్ వేస్తున్నారట. ఫలక్‌నుమా ప్యాలెస్‌ను గుర్తుకుతెచ్చేలా ఉండబోతున్న ఈ ఇంటిని అల్యూమినియం ఫ్యాక్టరీలో నిర్మిస్తున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ వార్తతో నాని టీం ఈ సారి ఏదో పెద్ద ప్లానే వేసిందని తెగ చర్చించుకుంటున్నారు. ఇక డిసెంబర్ చివరికల్లా లేదా జనవరి మొదట్లో ఈ మూవీ నుంచి మరో గ్లింప్స్ లాంచ్ చేసేందుకు సన్నాహాలు చేస్తుందట. మరి దీనిపై రాబోయే రోజుల్లో మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. ఈ మూవీలో కిల్ ఫేం రాఘవ్ జుయల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓ వైపు బ్లాక్ బస్టర్ దసరా కాంబో రిపీట్ అవడం, మరోవైపు జెర్సీ, గ్యాంగ్ లీడర్ తర్వాత నాని-అనిరుధ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ది ప్యారడైజ్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# నా కెరీర్‌తో అసంతృప్తిగా ఉన్నాను..

నటి అను ఇమ్మాన్యుయేల్ కీలక వ్యాఖ్యలు



**టాకీస్:** అవకాశాల కోసం తాను ఆరాటపడనని, తన కెరీర్ పట్ల కొంత అసంతృప్తి ఉందని నటి అను ఇమ్మాన్యుయేల్ అన్నారు. కెరీర్ ఆరంభంలో చేసినట్లుగా రొటీన్ కమర్షియల్ చిత్రాల్లో ఇకపై నటించకూడదని నిర్ణయించుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. రష్మిక మందన్నతో కలిసి ఆమె నటించిన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అను ఇమ్మాన్యుయేల్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో పాత్ర చిన్నదే అయినా ఎంతో సంతృప్తిని ఇచ్చిందని పేర్కొంటూ, అమ్మాయిల గురించి ఒక మంచి విషయం చెప్పే సినిమా కాబట్టే నటించేందుకు ఒప్పుకున్నానని వెల్లడించింది. హాలీవుడ్‌లో లాగా హీరో, హీరోయిన్, విలన్ అనే తేడా లేకుండా అన్ని పాత్రలకు ప్రాధాన్యం ఇస్తూ దర్శకుడు రాహుల్ ఈ కథను తీర్చిదిద్దారని తెలిపింది. థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు కొన్ని సన్నివేశాలకు అబ్బాయిలు కూడా చప్పట్లు కొట్టడం చూసి తాను ఆనందించానని చెప్పుకొచ్చింది.

కమర్షియల్ సినిమాల్లో ఓవర్ యాక్షన్ చేయిస్తారని, కానీ ఈ చిత్రంలో 'దుర్గ' పాత్ర కోసం చాలా సహజంగా నటించానని అను వివరించారు. సమాజంలో మహిళలకు "ఎలా మాట్లాడాలి, ఎలాంటి బట్టలు వేసుకోవాలి, ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి వంటి ఎన్నో షరతులు ఉంటాయని, కానీ మగవాళ్లకు ఉద్యోగం, సంపాదన తప్ప మరేమీ ఉండవని వ్యాఖ్యానించింది.

తన సినీ కెరీర్ పై అసంతృప్తిగానే ఉన్నా "పవన్ కల్యాణ్, అల్లు అర్జున్, నాని, కార్తి వంటి పెద్ద స్టార్లతో కలిసి నటించడం పట్ల ఓ సంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని కమర్షియల్ చిత్రాలు చేసి ఉండకూడదని ఇప్పుడు అనిపిస్తోందన్నారు. నాలుగు డ్యాన్స్ స్టెప్పులు వేసి, కొన్ని డైలాగులు చెప్పడంతో నటిగా సంతృప్తి రాదన్నారు. అందుకే ఇకపై అలాంటివి చేయకూడదని నిర్ణయించుకున్నానని స్పష్టం చేసింది. ప్రస్తుతం కొన్ని కొత్త కథలు వింటున్నానని, ఒక సినిమాకు అంగీకారం కుదిరిందని, ఆ వివరాలను నిర్మాణ సంస్థ త్వరలో ప్రకటిస్తుందని ఇమ్మాన్యుయేల్ తెలిపారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.